జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php



ప్రజాపాలన

నిజాయితీ, నిబద్ధతతో జర్నలిస్టుగా పనిచేయాలనుకొంటున్నారా?

మీ ఏరియాలోని ప్రజల సమస్యలను మీ కలం ద్వారా ప్రభుత్వదృష్టికి తీసుకువెళ్లాలి అనుకుంటున్నారా ?ఇంకెందుకు ఆలస్యం మీ ఏరియాకు మీరే రిపోర్టర్... రండి ..ప్రజాపాలన దినపత్రిక మీకు అవకాశం కల్పిస్తుంది

వివరాలకు సంప్రదించండి 8886022523



సంపుటి 7 సంచిక 92 | హైదరాబాద్, జూన్ 16 శుక్రవారం 2023 | 8 పేజీలు | వెల : 5.00


# దూకుడు పెంచిన టీ.కాంగ్రెస్ నేతలు..

## విమర్శలు, ఆరోపణలే కాదు.. సత్తా చాటే దిశగా సభలు..



కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహం ఏమో కానీ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో దూకుడు రోజురోజుకు పెరుగుతోంది. మాటల్లో పదును కూడా రోజురోజుకు పెరిగిపోతుంది. అధికార బీఆర్ఎస్ పార్టీని ఒకవైపు.. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఒక ఆట ఆడేసుకుంటున్నారు. ఆరోపణలు గుప్పిస్తున్నారు. విమర్శల వర్షం కురిపిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తమదే విజయం అంటూ పూర్తి విశ్వాసంతో ప్రకటనలు చేస్తున్నారు. అయితే ఆ విశ్వాసం ప్రజల్లో పెల్లుబికుతున్న అభిమానం వల్ల వచ్చిందా లేక కర్ణాటక ఫలితాలు ఇక్కడ రిపీట్ అవుతాయన్న ఒక అభిప్రాయాన్ని అందరిలో కల్పించడం ద్వారా పార్టీ బలగాన్ని పెంచుకునే వ్యూహంలో భాగంగా వచ్చిందా అన్నది కాస్త తరచి చూడాల్సి ఉంది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో చేతికిలబడిన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు నిన్న మొన్నటి వరకు కూడా రాష్ట్రంలో పార్టీ పొజిషన్ రెండా? మూడా? అన్న సందిగ్ధావస్థలోనే గడిపారు. అటువంటి పరిస్థితిలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనూహ్యంగా ఘన విజయం సాధించడం ఒక్కసారిగా పరిస్థితిని తారుమారు చేసింది. కర్ణాటక ఫలితాలు వచ్చేవరకు తెలంగాణలో అధికార బీఆర్ఎస్ పార్టీని ఢీ కొట్టేది భారతీయ జనతా పార్టీనేనని చాలామంది భావిస్తూ వచ్చారు. ఖమ్మం, నల్గొండ వంటి జిల్లాలలో అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేని పరిస్థితిని బిజెపి నేతలు బాగానే మేనేజ్ చేశారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 119 నియోజకవర్గాలలో తాము కనీసం 80 సీట్లను గెలుచుకుంటామని జిల్లాల వారిగా లెక్కలేసారు కమల నాథులు. ఆ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయి ఇప్పుడు తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలలో టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలో చురుకుగా కనిపిస్తున్నాయి. మొన్నటి వరకు పాదయాత్రలతో హోరెత్తిన తెలంగాణ బిజెపిలో ఇప్పుడు కాస్త స్తబ్దత నెలకొంది. (మిగతా 2లో..)

# దేశమంతా తెలంగాణ మోడల్ అమలయ్యేంత వరకు పోరాడుతా

## దేశ రాజకీయాల్లో మార్పులకు... మహారాష్ట్ర నుంచే శ్రీకారం : కేసీఆర్






నాగ్‌పూర్ :మహారాష్ట్ర, నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం.. అట్టహాసంగా జరిగింది. గాందీబాగ్‌లో ఏర్పాటుచేసిన పార్టీ ఆఫీసులో.. పార్టీ నేతలతో కలిసి గులాబీ జెండా ఆవిష్కరించారు కేసీఆర్. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలను ఉద్దేశించి మాట్లాడిన కేసీఆర్ మహారాష్ట్రలో బీఆర్ఎస్ తుపాన్‌లా దూసుకెళ్తోందన్నారు. ఇప్పటికే లక్షల మంది తమ కమిటీల్లో చేరారని చెప్పారు. ఎవరికి పడితే వారికి కాదు రైతులకు, యువతకు అవకాశమిస్తామని చెప్పారు కేసీఆర్.బీజేపీ టార్గెట్‌గా పరోక్ష విమర్శలు చేశారు ముఖ్యమంత్రి కేసీఆర్. దేశంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ధర్మం పేరిట, జాతీయవాదం పేరిట రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. దేశంలో మార్పునకు మహారాష్ట్ర నుంచే నాంది పలుకుతామన్నారు కేసీఆర్. దేశంలోని సామాన్య ప్రజల దగ్గర ఆలోచనా (మిగతా 2లో..)

# పల్లెప్రగతితో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం : మంత్రి సత్యవతి రాథోడ్



మహబూబాబాద్ : తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన కార్యక్రమాలతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొందని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయి గూడెంలో పల్లె ప్రగతి దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గ్రామాలపై పట్టు ఉండడంతో వాటి అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. దేశ ప్రగతికి పల్లెలు పట్టుగొమ్మలుగా ఉంటాయని భావించి ఆ దిశగా ఊరూరా పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. పరిశుభ్రత, స్వచ్ఛతే లక్ష్యంగా దశలవారీగా పల్లెప్రగతిని చేపట్టడంతో పట్టణాల్లో ఉన్న సౌకర్యాలు పల్లెల్లో కనిపిస్తున్నాయని అన్నారు. ప్రకృతి వనాలతో పల్లెలన్నీ పచ్చందాలతో కనువిందు చేస్తున్నాయని అన్నారు. ట్రాక్టర్లు, ట్రాలీలతో ఇంటింటికీ చెత్త సేకరణ, గ్రామానికో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, నర్సరీల ఏర్పాటు, నిరంతరం మొక్కల పెంపకం వంటి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయని అన్నారు.



# గుజరాత్ తీరం తాకిన బిపర్‌జాయ్ తుఫాన్..

## అర్థరాత్రి తీరం దాటే అవకాశం





అహ్మదాబాద్: సైక్లోన్ బిపర్‌జాయ్ గుజరాత్ తీరాన్ని తాకింది. మహారాష్ట్ర తీరంలో కూడా తీరానికి చేరింది. తీరం దాటే ప్రక్రియ అర్ధరాత్రి 12 గంటలకు కొనసాగనుందని భారత వాతావరణ శాఖతెలిపింది. ఈదురు గాలుల తీవ్రత గరిష్ఠ స్థాయి గంటకు 125 కిలోమీటర్లకు చేరింది. క్రమంగా ఈ గాలులు నెమ్మదించనున్నాయని అధికారులు వివరించారు. కాగా తీవ్ర వెంట భారీగా వర్షం కురుస్తోంది. కాగా తీవ్ర తుఫాను ముందే పసిగట్టడంతో అధికారులు పెద్ద ఎత్తున ముందస్తు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. తీర ప్రాంతాల నుంచి ఏకంగా లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. బిపర్‌జాయ్ ప్రభావంతో సబర్మతి రివర్ ఫ్రంట్, ద్వారకాదీష్ ఆలయాన్ని మూసివేశారు.

### కొన్ని ప్రాంతాల్లో 25 సెం.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చు:

బిపర్ జాయ్ తుఫాను తీరం దాటడం ప్రారంభమైంది. గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. (మిగతా 2లో..)

# బీఆర్ఎస్‌కు బీ-టీంగా కాంగ్రెస్..

## బండి సంజయ్‌ను మార్చేది లేదు..: తరుణ్ చుగ్



హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ అధిష్టానం ఇప్పటికే సన్నాహాలను ప్రారంభించింది. దీనిలో భాగంగా అగ్రనేతలు తెలంగాణలో వరుస పర్యటనలకు రెడీ అవుతున్నారు. ఈనెల 25న బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తెలంగాణలో పర్యటించనున్నట్లు టీబీజేపీ ఇంచార్జ్ తరుణ్ చుగ్ తెలిపారు. నాగర్ కర్నూల్ లో జరిగే భారీ బహిరంగ సభలో నడ్డా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన తరుణ్ చుగ్.. అతి త్వరలో అమిత్ షా పర్యటన కూడా ఖరారు కానున్నట్లు తెలిపారు. వాయిదా పడిన పర్యటనను ఖమ్మంలోనే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలిపారు.తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని మారుస్తున్నారన్న వార్తలపై స్పందించిన తరుణ్ చుగ్.. బండి సంజయ్ ని మార్చేది లేదని బిజెపి జాతీయ నాయకత్వం స్పష్టత ఇచ్చినట్లు తెలిపారు. నేతలంతా సమిష్టిగా కలిసి ఎన్నికల సమరంలో ఉంటారని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ తరుణ్ చుగ్ పేర్కొన్నారు. పార్టీలో ముఖ్య నేతలు అందరికీ కీలకమైన బాధ్యతలు ఉంటాయని.. రాష్ట్ర నాయకత్వం సమిష్టిగానే పనిచేస్తుందని తెలిపారు. బిజెపి ఎదుగుదలను చూసి ఓర్వలేక సామాజిక మాధ్యమాల్లో కొందరు దుష్ప్రచారం చేస్తున్నట్లు విమర్శించారు. బిజెపి, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయన్నడం అభూత కల్పనంటూ పేర్కొన్నారు. బీహార్ సీఎం నితీష్ నెతృత్వంలోని విపక్షాల భేటీకి కాంగ్రెస్ తో పాటు కేసీఆర్ కూడా హాజరవుతున్నారని.. దీనికి రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారంటూ పేర్కొన్నారు.

## ఖైరతాబాద్ లో సమావేశమైన విశ్రాంత బి ఎస్ ఎన్ ఎల్ ఎగ్జిక్యూటివ్ అధికారులు






హైదరాబాద్ (ప్రజాపాలన ప్రతినిధి):అఖిల భారత విశ్రాంత బి ఎస్ ఎన్ ఎల్ ఎగ్జిక్యూటివ్ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్, తెలంగాణ సర్కిల్ జనరల్ బాడీ మీటింగ్ ఖైరతాబాద్ లోని వాసవి అడిటోరియం లో గురువారం జరిగింది. ఈ సమావేశంలో 200 మంది విశ్రాంత అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ అధ్యక్షుడు మురళి జనార్దన్,సెక్రటరీ నేరెళ్ల కోటేశ్వరరావు, సర్కిల్ ప్రెసిడెంట్ మహేష్,సర్కిల్ సెక్రటరీ కె. జయరాం, ఎ జి ఎస్ దక్షణమూర్తి,ఒ ఎన్ సౌత్ కోటేశ్వరుడు, సర్కిల్ ఆఫీస్ బ్రాంచ్ సెక్రటరీ పాండురంగరావు,ఎక్స్ సి ఎస్ తదితరులు పాల్గొన్నారు.

# దూకుడు పెంచిన టీ.కాంగ్రెస్ నేతలు..

(మొదటి పేజీ తరువాయి)

ఈ స్తబ్దతను బద్దలు కొట్టడానికి ఖమ్మం జిల్లా కేంద్రంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సారధ్యంలో భారీ ర్యాలీకి తెలంగాణ నాయకత్వం ప్రణాళిక రచించింది. ఈ భారీ సభ ద్వారా రాష్ట్రంలో తమ ఉనికి మరోసారి గట్టిగా చాటే ప్రయత్నం చేసింది. అందుకోసం భారీ ఏర్పాట్లు చేసుకుంది. కానీ తెలంగాణ బిజెపి నేతలకు అశనిపాతంలా బిపోర్‌జాయ్ తుఫాన్ ఎదురయింది. పెను తుఫాను తాకిడికి తమ సొంత రాష్ట్రం గుజరాత్ తల్లడిల్లి పోతుంటే తాము ఇతర రాష్ట్రాలలో రాజకీయం చేయడం ఎందుకు అనుకున్నారో ఏమో కానీ అమిత్ షా ఖమ్మం జిల్లా పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఆయన ఎప్పుడు వచ్చేది ఇప్పుడప్పుడే తేలే పరిస్థితి లేదు. అయితే వెంటనే కోలుకున్న కమలనాథలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పర్యటనపై దృష్టి సారించారు. జూన్ 25వ తేదీన నడ్డా సభకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఆయన నాగర్ కర్నూలు సభకు హాజరు కానున్నారు.

**ద్విముఖ వ్యూహంలో టీపీసీసీ**

ఇదిలా ఉంటే తెలంగాణ కాంగ్రెస్‌లో ద్విగుణీకృతమవుతున్న కొత్త ఉత్సాహం పార్టీలో పలువురి చేరికకు కారణమవుతోంది. నిర్మల్, సిరిసిల్ల వంటి జిల్లాలలో పలువురు కీలక నాయకులు ఇతర పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా ఉన్నవారు సైతం బీఆర్ఎస్ పార్టీని వీడడం చర్చనీయాంశం అవుతుంది. ఈ చేరికలు ఇలా కొనసాగుతుండగానే తెలంగాణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఒకవైపు బిజెపపైనా, ఇంకొక వైపు బీఆర్ఎస్ పార్టీపైనా విరుచుకుపడుతున్నారు. ఇంకోవైపు కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర కొనసాగిన్తూ.. సమయం దొరికినప్పుడల్లా అధికార పార్టీ వైఫల్యాలను ఎండ కడుతున్నారు. అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు పదేపదే చెబుతున్నారు. ధరణి పోర్టల్ కారణంగా అధికార పార్టీ నాయకులు మాత్రమే లాభపడ్డారని జెన్యూన్‌గా భూములను కలిగి ఉన్న చాలా మంది ఇబ్బందులకు గురయ్యారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. సభలు, సమావేశాలే కాకుండా కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలోనూ చెలరేగిపోతున్నారు. తాజాగా రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం సంధించారు. ఈ ధోరణిని కొనసాగిస్తూనే పార్టీ ఒకింత వీక్‌గా కనిపిస్తున్న నియోజకవర్గాలలో ఇతర పార్టీ నాయకులకు గాలమేసే కార్యక్రమాన్ని కూడా వేగవంతం చేశారు ఇటీవల నిర్మల్ జిల్లాలో కీలకమైన నేత మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ గూటిని వీడి బిజెపిలో చేరిన నేపథ్యంలో అక్కడ ఎంతో కొంత బలమైన నేతగా పేరున్న బీఆర్ఎస్ నాయకుడు, సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడు అని భావించే శ్రీహరి రావును కాంగ్రెస్ పార్టీలోకి రప్పించుకున్నారు రేవంత్ రెడ్డి. ధరణి పోర్టల్, రీజినల్ రింగ్ రోడ్ అలైన్మెంట్‌లో అవకతవకలు, ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ఫీజు వసూలు లీజు తదితర అంశాలను టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రతిరోజు ప్రస్తావిస్తున్నారు.

**పొంగులేటి జాప్యానికి కారణమిదేనా?**

ఒకవైపు ప్రభుత్వం మీద ఆరోపణలు.. ఇంకొక వైపు చేరికలే కాకుండా తెలంగాణ ప్రజలకు ఒక నిర్దిష్టమైన సంకేతాలను ఇవ్వడానికి పార్టీ అగ్ర నేతలను తెలంగాణకు రప్పించే ప్రయత్నాలను సైతం తెలంగాణ కాంగ్రెస్ నాయకులు చేస్తున్నారు. సీఎల్పీ నాయకుడు పాదయాత్ర కొనసాగిస్తున్న నేపథ్యంలో దాని ముగింపు సభకు ప్రియాంక గాంధీనిగాని, రాహుల్ గాంధీనిగాని పిలిచే సన్నాహాల్లో ఉన్నారు. అన్ని కుదిరితే జూన్ 21 లేదా 23వ తేదీలలో అగ్ర నేతల్లో ఒకరు ఖమ్మం వేదికగా జరిగే సభకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇక తమ విజయ ప్రస్థానాన్ని ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించాలనుకుంటున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు అక్కడ బలమైన నేతగా పేరు ఉన్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు దాదాపు డిసైడ్ అయ్యారు. ఆయన కూడా కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారన్న ఇండికేషన్స్ వచ్చాయి. కానీ జూన్ 14వ తేదీన పొంగులేటి తాను ఏ పార్టీలో చేరబోతున్నది చెప్పేస్తానని గతంలో చెప్పినప్పటికీ ఆయన ఎందుకో వెనుకంజవేయడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. తెలంగాణలో జూన్ 14న ఆదాయపు పన్ను శాఖాధికారుల తనిఖీలు కలకలం రేపాయి. ముగ్గురు బీఆర్ఎస్ పార్టీ నేతల ఇళ్ళు, ఆఫీసులే లక్ష్యంగా ఐటి సోదాలు కొనసాగాయి. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైలా శేఖర్ రెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డిల వ్యాపార లావాదేవీలను, ఆదాయ వ్యయాలను, ఐటి రిటర్న్స్‌ని పరిశీలించారు ఐటి అధికారులు. ఇదంతా ఐటి సిబ్బంది రొటీన్ వర్క్‌లో భాగమే అయినా వీటి వెనుక కేంద్రంలోని బీజేపీ పెద్దల ప్రమేయం వుందన్న ఆరోపణలు వినిపించాయి. ఇదే క్రమంలో కాంట్రాక్టర్‌గా పేరున్న మాజీ ఎంపీ పొంగులేటిపైనా బీజేపీ నేతలు నజర్ పెట్టారన్న వార్తల నేపథ్యంలోనే ఆయన ఏ పార్టీలో చేరాలనే విషయంపై నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారని తెలుస్తోంది. మొత్తం మీద తెలంగాణలో నెంబర్ టు తామేనని నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నాయకులు యమా ధీమాగా ఉన్నారు. కాంగ్రెస్ నేతల్లో కనిపిస్తున్న ఈ ధీమాను కరిగించే దిశగా బీఆర్ఎస్, బిజెపి ఎలాంటి ఎత్తుగడలు వేస్తాయో వేచి చూడాలి.

## పల్లెప్రగతితో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం : మంత్రి సత్యవతి రాథోడ్

(మొదటి పేజీ తరువాయి)

పల్లె ప్రగతి కింద ఇప్పటి వరకు తెలంగాణలో 13,528 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,745 గ్రామపంచాయతీల్లో 1329.73 కోట్ల ఖర్చుతో వైకుంఠధామాలు నిర్మించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శశాంక, ఐటీడీఏ పీవో అంకిత్, ట్రైనీ కలెక్టర్ పింకేష్, సర్పంచ్ భారతి, ఎంపీపీ విజయ, జడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీ సదయ్య, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్ తీరం తాకిన బిపర్‌జాయ్ తుఫాన్..

(మొదటి పేజీ తరువాయి)

కచ్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, పోర్‌బందర్, రాజ్‌కోట్, మోర్బి, జునాగఢ్ జిల్లాల్లో అతి భారీ (11.5 సెం.మీ నుండి 20.4 సెం.మీ.) నుండి అత్యంత భారీ (20.5 సెం.మీ కంటే ఎక్కువ) వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ గతంలో హెచ్చరించింది. కొన్ని ప్రాంతాల్లో 25 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలిపింది.

**గుజరాత్ తీరానికి సమీపంలో నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు**

గుజరాత్‌లోని దేవభూమి ద్వారకా జిల్లాలో చెట్టు కూలడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడినట్లు అధికారులు తెలిపారు. బిపర్‌జాయ్ తుఫాను గురువారం సాయంత్రం కచ్ తీరంలో విధ్వంసకర గాలి వేగం, ఎడతెరిపిలేని వర్షంతో తీరాన్ని తాకింది. కచ్ జిల్లాలోని జఖౌ, మాండ్వి పట్టణాల సమీపంలో విధ్వంసం సృష్టించింది. చాలాచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఇంటి పైకప్పులు లేచిపోయాయి.సాయంత్రం 7 గంటల వరకు మరణ వార్తలేమీ లేవని గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ షాంఘ్వీ తెలిపారు.

## పామాయిల్ తోటలో అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన, కొండపల్లి




హైదరాబాద్: కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, నిన్న తమ పామాయిల్ తోటలో జరిగిన అగ్ని ప్రమాద స్థలంలో సందర్శించటం జరిగింది,ఈ సందర్భంగా, కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతు,నిన్న జరిగిన అగ్ని ప్రమాద ఘటనకు బాధ్యులు ఎవరైనా, పోలీస్ శాఖ వారు విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలి,ఈ దుర్ఘటనపై పోలీసు శాఖ సమగ్రమైన విచారణ జరిపి వాస్తవాలు వెలికి తీయాలి,ఒకవేళ ఈ దుర్ఘటన వెనుక రాజకీయ ప్రేరేపిత అసాంఘిక శక్తులు ఉంటే చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలి,ఇటువంటి సంఘటనలతో బిజెపి కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటే పొరపాటే అవుతుంది.ఈ దుర్ఘటన నేపథ్యంలో వెంటనే అప్రమత్తమై స్పందించి మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక దళ సిబ్బందికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.అనంతరం బిజెపి సహచరులతో కలిసి ఫైర్ స్టేషన్ కి వెళ్లి నిన్న మంటలను అదుపులోకి తీసుకువచ్చిన ఫైర్ సిబ్బందికి శాలువాలతో అభినందనలు తెలియజేశారు కొండపల్లి శ్రీధర్ రెడ్డి,ఈ కార్యక్రమం లో మధిర అసెంబ్లీ కన్వీనర్, ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రుద్రప్రదీప్,ఖమ్మం ఖమ్మం కార్పొరేటర్, దొంగల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి, చిలువేరు సాంబశివరావు,జిల్లా అధికార ప్రతినిధి, రామిశెట్టి నాగేశ్వరావు, రామమోహన్ రెడ్డి, జేమ్ముల ప్రణీత్ రెడ్డి,పట్టణ,మరియు మండల అధ్యక్షులు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్ రెడ్డి,రావుల భారత్ రెడ్డి, నరేష్ రెడ్డి శివరాజ్ సుమంత్, తదితరులు పాల్గొన్నారు,

## దేశ రాజకీయాల్లో మార్పులకు...

# మహారాష్ట్ర నుంచే శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

బాంఢాగారం ఉందనీ ఎమర్జెన్సీ సమయంలో వారి తీర్పును స్పష్టంగా చూశామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లోనూ.. అదనుకోసం జనం ఎదురుచూస్తున్నారని చెప్పారు కేసీఆర్. దేశంలో పరివర్తన కోసం.. బీఆర్ఎస్ ఒక మిషన్‌లా పనిచేస్తుందన్న కేసీఆర్.. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనేది కేవలం నినాదం కాదనీ, అది నిర్ధారణ అని స్పష్టం చేశారు. ముంబై, నాందేడ్ సహా కీలక నగరాల్లో పార్టీ ఆఫీసులు ప్రారంభించుకుని.. మరింత క్రియాశీలకంగా పనిచేస్తామని చెప్పారు.

**దేశమంతా తెలంగాణ మోడల్ అమలయ్యేంత వరకు పోరాడుతా**

దేశమంతా తెలంగాణ మోడల్ అమలయ్యే వరకు పోరాడుతూనే ఉంటానని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పునరుద్ఘాటించారు. దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి గల్లీకి వెళ్లి తెలంగాణ పథకాలు వివరిస్తాం అని స్పష్టం చేశారు. భారతదేశంలో మార్పునకు మహారాష్ట్ర నుంచే నాంది పలకాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర నాగ్‌పూర్‌లో బీఆర్ఎస్ పార్టీని ప్రారంభించిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు.రైతులు బలహీనులు కాదు.. దేశాన్ని నడుపుతున్న బలమైన శక్తులు అని కేసీఆర్ ప్రశంసించారు. రైతులను అవమానించే వారికి తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. దేశానికి అన్నం పెట్టే రైతు పార్లమెంట్‌లో చట్టాలు చేయలేడా? అని ప్రశ్నించారు. దేశంలో 48 శాతం మంది రైతులే ఉన్నారు. వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తే 60 శాతం మందికి ఉపాధి లభిస్తుంది. సరిపడా సాగునీరు, విద్యుత్ ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం కావాలన్నారు. మహారాష్ట్ర బడ్జెట్ రూ. 10 లక్షల కోట్లకు చేరాలి. మధ్యప్రదేశ్‌లో కూడా బీఆర్ఎస్ రావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని కేసీఆర్ తెలిపారు.

**తెలంగాణలో సాగును పండుగలా మార్చాం..**

రెవెన్యూ వ్యవస్థలోని అవినీతిని పారద్రోలాలా.. వద్దా..? అని కేసీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను డిజిటలైజ్ చేసి అవినీతికి అడ్డుకట్ట వేశాం. తెలంగాణలో పండిన పంటంతా ప్రభుత్వమే కొంటోంది. పంట సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నాం. ఉచిత విద్యుత్, ఉచిత నీరుతో తెలంగాణలో సాగును పండుగలా మార్చాం. ఇప్పుడు తెలంగాణ వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటేసింది. అంతేకాకుండా రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అమలు చేసి రైతులకు, వారి కుటుంబాలకు అండగా ఉంటున్నామని కేసీఆర్ వివరించారు.

**మహారాష్ట్ర ఎందుకు సాధించదు..?**

తెలంగాణలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందిస్తున్నాం అని కేసీఆర్ తెలిపారు. తాగునీటి కోసం బిందెలు పట్టుకుని తిరిగే పరిస్థితి తెలంగాణలో ఎక్కడా లేదు. తెలంగాణ లాంటి చిన్న రాష్ట్రమే ఇన్ని సాధిస్తే.. మహారాష్ట్ర ఎందుకు సాధించదు..? తెలంగాణలా చేస్తే మహారాష్ట్ర దివాలా తీస్తుందని కొందరు మరాఠా నేతలు అంటున్నారు. తెలంగాణ తరహాలో చేస్తే మరాఠా నేతలు దివాలా తీస్తారు.. ప్రజలు దీపావళి జరుపుకుంటారు. రైతులు తలచుకుంటే ఏదైనా చేయగలరు. ఎలాంటి మార్పునైనా సాధించగలరు అని కేసీఆర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో తెలంగాణ నమూనా పాలన వచ్చే వరకు బీఆర్ఎస్ పోరాడుతుంది. మహారాష్ట్రలో అనేక మంది నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మహారాష్ట్రలో త్వరలోనే పరివర్తన వస్తుంది.. అది దేశమంతా పాకుతుంది. నాగ్‌పూర్‌లో ఆఫీసు ప్రారంభించుకున్నాం. ఔరంగాబాద్, పుణెలోనూ త్వరలో పార్టీ ఆఫీసులను ప్రారంభిస్తాం అని కేసీఆర్ తెలిపారు.

# కలకలం రేపుతున్న ఐటీ దాడులు

హైదరాబాద్, జూన్ 15, :తెలంగాణ బీఆర్ఎస్ కీలక నేతల నివాసాలు, కార్యాలయాలపై ఇన్ కంట్యాక్స్ దాడులు కలకలం రేపాయి. వరుసగా ముగ్గురు కీలక నేతల ఇళ్లు, ఆఫీసులు, వ్యాపార సంస్థల్లో ఐటీ దాడులతో ఒక్క సారిగా రాజకీయ వేడి రగులుకుంది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో ఐటీ దాడుల సంఖ్య తగ్గిపోయింది. మరీ ముఖ్యంగా కొంత కాలం కిందట బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా జరిగిన దాడుల తీవ్రత పూర్తిగా తగ్గిపోవడం వెనుక బీజేపీ కేసీఆర్ కూడా విమర్శలు బంద్ చేయడమే కారణమన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది. ఒకే సారి ముగ్గురు బీఆర్ఎస్ కీలక నేతలు లక్ష్యంగా ఐటీ దాడులు జరగడం సంచలనం సృష్టించింది. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, నాగర్ కర్నూలు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల నివాసాలు, కార్యాలయాలలో దాదాపు 50 ఐటీ బృందాలు సోదాలు చేపట్టారు. వీరి నగదు లావాదేవీలపైన ఐటీ అధికారులు దృష్టి పెట్టారు. ఈ ముగ్గురూ బీఆర్ఎస్ కి చెందిన నగదును తమ వ్యాపార సంస్థల ద్వారా సర్క్యులేట్ చేస్తున్నారన్న ఆరోపణలతో సోదాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. మర్రి జనార్ధన్ రెడ్డికి.. వస్త్ర, జ్యూయలరీ వ్యాపారాలు ఉన్నాయి. కొత్త ప్రభాకర్ రెడ్డి సీఎం నియోజకవర్గం గజ్వేల్ ను చూసుకుంటున్నారు. సీఎం తరపున ఆయనే అన్నీ చక్క బెడుతూ ఉంటారు. పైళ్ల శేఖర్ రెడ్డికి రియల్ ఎస్టేట్ కంపెనీలతో పాటు కంపెనీలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ముగ్గురి నివాసాలు కార్యాలయాలపై ఐటీ దాడులు బీఆర్ఎస్ లో కలకలం రేపుతున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ నేతలపై దర్యాప్తు సంస్థలు నజర్ ఇటీవలి కాలంలో బీజేపీతో ఆ పార్టీ ఒక అవగాహనకు వచ్చిందన్న ప్రచారం ఇటీవలి కాలంలో జోరుగా సాగుతుండటం అదీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. కమలం పార్టీకి ఒకింత ఇబ్బందికరంగా మారింది. ఒక వైపు కేసీఆర్ మోడీ, బీజేపీ లక్ష్యంగా విమర్శలకు చుక్క పెట్టేయడం, అదే సమయంలో ఢిల్లీ మద్యం కుంభకోణంలో తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖరరావు కుమార్తె కవితపై దర్యాప్తు సంస్థల విచారణ వేగం మందగించడంతో బీజేపీ, బీఆర్ఎస్ లు ఒక గూటి పక్షులే అన్న భావన పొలిటికల్ సర్కిల్స్ లో వ్యక్తం అయ్యింది. అయితే ఇప్పుడు ఐటీ అధికారులు ముగ్గురు బీఆర్ఎస్ నేతల నివాసాలూ , కార్యాలయాల్లో సోదాలు నిర్వహిస్తుండటం, ఆ సోదాలు చేస్తున్న ఐటీ అధికారులు కేంద్ర బలగాలను భద్రతగా తెచ్చుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. పైగా ఈ సోదాలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు సరిగ్గా ఒక్క రోజు ముందు జరగడం ఆ ప్రాధాన్యతను మరింత పెంచింది.కొండాపూర్ లోని లుంబిని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్ విల్లాస్ లోని కొత్త ప్రభాకర్ రెడ్డి నివాసంలో బుసోదాలు జరుగుతున్నాయి. అదే సమయంలో ఆయన కార్యాలయాలలో కూడా సోదాలు జరుగుతున్నాయి. అలాగే జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోని మర్రి జనార్దన్ రెడ్డి ఇంటికి వెళ్లిన ఐటీ అధికారులు సోదాలను నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలతో పాటు నగరంలోని వివిధ రియలెస్టేట్ సంస్థల కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ లో కూడా రెయిడ్స్ జరుగుతున్నాయి.

## ప్రచారం ప్రారంభించిన నేతలు

ఖమ్మం, జూన్ 15, :తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు మరో ఐదు నెలల సమయం ఉంది. ఈ క్రమంలో పార్టీలన్నీ వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. సమయం దగ్గర పడుతుండటంతో పలు పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు పార్టీలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఎక్కడ ఏ అభ్యర్థిని రంగంలోకి దించాలనే దానిపై ప్రముఖ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రాజకీయాలు వేడెక్కిపోతున్నాయి. నువ్వా.. నేనా అన్నట్లు ఇప్పటి నుంచి పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మం జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఖమ్మం జిల్లా పాలేరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.కొద్ది రోజులు ముందే ఎన్నికల ప్రచార రథాన్ని సిద్దం చేసిన ఎమ్మెల్యే.. ప్రచార రథానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ముందుగా కూసుమంచి మండలం ముత్యాల గూడెం గ్రామంలో ఈ ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందాల.. తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న నేపథ్యంలో ఖమ్మం జిల్లా రాజకీయాలు హీటెక్కాయని అన్నారు. పాలేరులో మా ప్రత్యర్థి కాంగ్రెస్ అని, పాలేరులో గట్టి పోటీ ఉంటుందని, రాజకీయాలు అంటేనే పోటీ అని అన్నారు. నేను ఎపుడూ ప్రజల్లోనే ఉన్నాను.. ఎన్నికలు సమయం వచ్చింది కనుక ఎక్కువ తిరుగుతున్నాం.. ముఖ్యమంత్రి కేసీఆర్ సిట్టింగ్‌ల టికెట్స్ ఇస్తామన్నారని అన్నారు. టికెట్ గురించి ఆలోచనే లేదన్నారు. నాకు ఎన్నికల కోసం ప్రత్యేక వ్యూహాలు అవసరం లేదని పేర్కొన్నారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటు..: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి











హైదరాబాద్ 15 జూన్ ప్రజాపాలన: దుబ్బాక లోని యువత మహిళలు చిన్నారుల కోసం వివిధ గ్రామాల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ పార్లమెంటు సభ్యులు (ఎంపి) కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న యువత, మహిళలు, చిన్నారుల కోసం ఓపెన్ జిమ్ లను అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు. ఓపెన్ జిమ్ ద్వారా యువత ఆరోగ్యంగా ఉంటారని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం కోసం ఓపెన్ జిమ్ లోని అధునాతన సాంకేతిక పరికరాలు పనికి వస్తాయని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని రాయపోల్, పోతారం, ఆరపల్లి, పెద్ద మాసంపల్లి, తొగుట, దుబ్బాక, కొండాపూర్, దౌల్తాబాద్ గ్రామాలలో మొదటి విడతగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో నియోజక వర్గ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల యువతులు, మహిళలు, చిన్నారులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓపెన్ జిమ్ లో సాధన చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ మేరకు పలు గ్రామాల్లో ఓపెన్ జిమ్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అరబిందో ఫార్మాసిటీ కంపెనీ అనుబంధ సంస్థ యుగియా ఫార్మసిటికల్ కంపెనీ ఆధ్వర్యంలో ఓపెన్ జిమ్ పరికరాలు సమకూర్చగా వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు దుబ్బాక పార్లమెంటు సభ్యులు వెల్లడించారు. ఇప్పటివరకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలను ఆయా గ్రామాల్లోని యువత మహిళలు చిన్నారులు చక్కగా ఉపయోగించుకుని మంచి ఆరోగ్యాన్ని ఆహ్లాదాన్ని పొందాలని సూచించారు.

**ఓపెన్ జిమ్ తో ప్రయోజనాలెన్నో.. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి**

ఓపెన్ జిమ్ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని పార్లమెంటు సభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు . ఆరుబయుట స్థలంలో జిమ్ చేయడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. సూర్య రష్మీ తగలడం వల్ల విటమిన్ డి శరీరానికి అందడం తో పాటు ఇతర రోగాలు రాకుండా పనిచేస్తుందని ఈ సందర్భంగా వెల్లడించారు.

## గ్రామాల రూపురేఖలను మార్చిన పల్లెప్రగతి

### మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి



మంచిర్యాల బ్యూరో, ( నిర్మల్ ) జూన్ 15, ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తర్వాత పల్లె ప్రగతి కార్యక్రమం గ్రామాల రూపురేఖలను సమూలంగా మార్చేసిందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారంతెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవంను జిల్లాపంచాయతీ శాఖ అధ్వర్యంలో నిర్మల్ జిల్లా లోని భాగ్యనగర్ గ్రామ పంచాయయితీ కార్యాలయం లో రాష్ట్ర మంత్రి అటవి, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి లు ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెప్రగతి కార్యక్రమం చేపట్టిన తరువాత గ్రామ రూపురేఖలు మారాయన్నారు. పల్లెలు బాగుంటేనే దేశం బాగుంటుందని, పల్లెలు పరిశుభ్రంగా ఉంచి అభివృద్ధి చేసేందుకు గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె ప్రగతి కార్యాక్రమానికి అంకురార్పణ చేశారన్నారు.పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా పల్లెలు అభివృద్ధి చెందడంతో పాటు పారిశుధ్యం మెరుగుపడిందన్నారు. పల్లెల్లో ప్రభుత్వం రాష్ట్రములోని 12,769 గ్రామాలను 100 శాతం ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్ది దేశంలోనే టాప్ ర్యాంక్ ను సాధించిందన్నారు. తెలంగాణ పల్లెలకు 13 జాతీయ అవార్డులు రాష్ట్రపతి చేతులమీదుగా ఆయా స్థానిక సంస్థల ప్రతినిధులు అందుకున్నారని తెలిపారు. ప్రతి ఊరుకు హరితహారం, నర్సరీ, డంపింగ్ యార్డ్, ట్రాక్టర్లు, ట్రాలీలు, ట్యాంకర్లు, వైకుంఠ ధామాలు, క్రీడా స్థలాలు, పల్లె దవాఖానాలు, మిషన్ భగీరథ నీళు,, 24 గంటల విద్యుత్ తో వెలుగుల వాకిల్లుగా తెలంగాణ పల్లెలు పటిష్ఠం అయ్యాయని, గ్రామాలు స్వయం సమృద్ధితో ఎదిగాయని, దశాబ్ది ఉత్సవం వేళ కొత్త ఉత్సాహంతో నిండాయని అన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకర్ ను ఏర్పాటుతోపాటు 12745 గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు వచ్చాయని తెలిపారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత గడిచిన తొమ్మిది సంవత్సరాలలో గ్రామాలలో ప్రగతిని ప్రజలకు వివరించేందుకు ఈ ఉత్సవాలు నిర్వహించడం జరుగుచున్నదని, తెలంగాణ రాకముందు గ్రామాలలో ఎండకాలంలో రెండు ప్రధాన సమస్యలు తాగునీటి సమస్య, కరెంట్ సమస్య ఉండేదని అన్నారు. అ సమస్యలు లేకుండా అభివృద్ధిని సాధించుకున్నామని, గ్రామాలలో ఇంటింటి నుండి తడిచెత్త, పొడి చెత్త సేకరించి ఎరవును తయారు చేయుడం జరుగుచున్నదని తెలిపారు. అనంతరం గ్రామ పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. నిర్మల్ జిల్లా లోని ముజ్గి గ్రామ పంచాయతీకి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు పొందిన సందర్భంగా మంత్రి, జిల్లా పాలనాధికారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, బిపిఓ శ్రీలత, ఎంపీపీ రామేశ్వర్, ఎంపీటీసీలు,సర్పంచ్ లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఎన్నికల అడుగులు...

హైదరాబాద్, జూన్ 15, :తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అంచనాలకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించనుంది. తెలంగాణలో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సన్నద్ధతపై అంచనా కోసం భారత ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం మూడు రోజులపాటు రాష్ట్రంలో పర్యటించనుంది.రాష్ట్ర ఎన్నికల సన్నద్ధతపై చర్చించి అంచనా వేయడానికి సీఈవో వికాస్ రాజ్ బుధవారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అంజనీ కుమార్‌తో సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణలో శాసనసభకు జరగనున్న సాధారణ ఎన్నికల గురించి జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్ల సంసిద్ధతను అంచనా వేయడానికి ఈ సమావేశం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈసీఐ తెలిపింది. రాబోయే ఎన్నికల ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ, వికాస్ రాజ్ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం పర్యటనను ప్రకటించారు.సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ ధర్మేంద్ర శర్మ, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం జూన్ 22-24 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఉంటుంది. రాబోయే ఎన్నికలకు సంసిద్ధతను అంచనా వేయనుంది.ఈసీఐ ప్రతినిధి బృందం ముందుగా సీఈవో, స్పెషల్ పోలీస్ నోడల్ ఆఫీసర్, సీఏపీఎఫ్ నోడల్ ఆఫీసర్‌తో కీలకమైన సమావేశాలలో పాల్గొంటుంది. ఈ చర్చలు ఎన్నికల భద్రతకు సంబంధించిన అంశాలు, వ్యూహాలను పరస్పరం మార్పిడి చేసుకోవడానికి అవకాశం కల్పిస్తాయి' అని ఈసీఐ పేర్కొంది.'ఆ తర్వాత ఈసీఐ ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఆదాయపు పన్ను (సీబీడీటీ), ఎన్సీబీ, ఎక్సైజ్ శాఖ, జీఎస్టీ డిపార్ట్‌మెంట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీతో సహా వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో విస్తృతమైన సంప్రదింపులు జరుపుతుంది. ఎన్నికల సమగ్రతను కాపాడేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో సమన్వయాన్ని పెంపొందించడం ఈ సమావేశాల లక్ష్యం..' అని వివరించింది.

## పొంగులేటీ... నాన్చుడు



ఖమ్మం, జూన్ 15, :తెలంగాణ రాజకీయాల్లో గత కొంతకాలంగా పొంగులేటి హాట్ టాపిక్ గా మారరు.. బిఆరెస్ నుండి బహిష్కరణ తరువాత పొంగులేటి ఏ పార్టీలోకి వెళ్తున్నరు.. ఏ పార్టీలోకి వెళ్తే లాభం.. ఆయన వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్ని స్థానాలు గెలుచుకోవచ్చు అని అన్ని పార్టీలు బేరిజు వేసుకోవడంతో పాటు వారిని పార్టీలోకి ఆహ్వానించడానికి కూడా అన్ని పార్టీలు ముందున్నాయి.. ఇదే అంశం రాష్ట్ర వ్యాప్తంగా కూడా పెద్ద చర్చనే జరుగుతుంది.. అయితే ప్రస్తుతం పొంగులేటి ఏ పార్టీ లో చేరుతున్నారనే సాగదిత ధోరణి మొదటికే మోసం వచ్చేలా కనిపిస్తుంది.. ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆత్మీయ సమ్మేళనలు నిర్వహించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వారి సలహాలు, సూచనలు తీసుకున్నారు.. ఏ పార్టీలో చేరాలి కొత్త పార్టీ పెడితే ఎలా ఉంటుంది అనే దానిపై కూడా తీవ్రంగా మంతనాలే జరిగాయి.మరోవైపు పొంగులేటి మొదట్లో బీజేపీ లోనే చేరుతున్నారనే వార్తలు వినిపించాయి. బీజేపీ నేత ఈటెల సైతం పలుమార్లు పొంగులేటి తో భేటీ కావడంతో ఇక బీజేపీలోకే ఫైనల్ అనుకున్నారు.. అనంతరం బిఆరెస్ అసమ్మతి నేతలు, తెలంగాణ ఉద్యమకారులతో పొంగులేటి భేటీ అయి కొత్త పార్టీపైన కూడా చర్చ జరిగింది.. ఇక కర్ణాటక ఫలితాల వరకు వేచి చూసిన పొంగులేటి అక్కడ కాంగ్రెస్ భారీ మెజారిటీ తో గెలిచిన తరువాత తన చూపు కాంగ్రెస్ వైపు పడింది.. పలుమార్లు కాంగ్రెస్ నేతలతో రాహుల్ గాంధీ టీం తో కూడ మంతనాలు జరిపినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.. ఇక పొంగులేటి కాంగ్రెస్‌లో చేరడమే తరువాయి అని, మీడియా సమావేశం ఉండబోతుందని అనుకునే లోపే వాయిదా పడుతూ వస్తుందని ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు పొంగులేటిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా పొంగులేటి నాన్చుడు ధోరణిపై ఖమ్మం కాంగ్రెస్ నేతల అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. రేణుక చౌదరి, వి.హనుమానంతరావు లాంటి వారు బహిరంగగానే విమర్శలు చేస్తున్నారు.. పార్టీ లో చేరితే చేరాలి కానీ ఇంత హైప్ ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు.. గతంలో పొంగులేటి లేకున్నా ఖమ్మం లొ 8 సీట్లు గెలిచిన ఘనత కాంగ్రెస్ ది అని.. తాము ఇప్పుడు కష్టపడ్డ ఖమ్మం క్లీన్ స్విప్ చేస్తామని ఖమ్మం నేతలు గుసగుసలాడుతున్నారాట.. పొంగులేటి అంత గొప్ప లిడర్ అయితే బిఆరెస్ ని ఎందుకు గెలిపించుకోలేకపోయాడని ఆ జిల్లా నేతలు గాంధీ భవన లో తమ బాధ చెప్పుకుంటున్నారట. కర్ణాటక గెలుపుతో ఉత్సాహంగా ఉన్న కాంగ్రెస్.. పొంగులేటి చేరికతో జోష్ వస్తుంది అనుకుంటే.. ఆయన నాన్చుడు ధోరణి మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది..

## మన ఊరు మనబడి అభివృద్ధి

## పనులు పూర్తి కావాలి: జిల్లా పాలనాధికారి వరుణ్ రెడ్డి



మంచిర్యాల బ్యూరో, నిర్మల్, జూన్ 15, ప్రజాపాలన: మన ఊరు మనబడి ప్రగతి పనులు పక్షం రోజుల లో పూర్తి చేయాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి పేర్కొన్నారు. ప్రగతిపై గురువారం నూతన జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పాలనాధికారి కర్నాటి వరుణ్ రెడ్డి జిల్లాలో మన ఊరు మనబడి కింద తొలి విడతలో ఎంపికైన వలు పాఠశాలల పనుల ప్రగతిని జిల్లా విద్యాశాఖ అధికారి, వివిధ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఏఈ లు, ఎంఈఓ లు సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా, వైద్యంపై ఎంతో శ్రద్ధ వహిస్తుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి ధీటుగా తయారు చేయడానికి మన ఊరు మన బడి క్రింద మొదటి విడతలో 9123 పాఠశాలలను ఎంపిక చేసిందని, దీనిలొ భాగంగా అన్ని పాఠశాలలో 12 రకాల పూర్తిస్థాయి అభివృద్ధి పనులు చేపట్టిందని ఆయన తెలియజేశారు. జిల్లాలో మొత్తం 90% పనులు పూర్తయిన పాఠశాలలు 128 ఉన్నాయని, మిగిలిన పాఠశాలలలో ఈ పదిహేను రోజుల లోపు అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆయన ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ పేరిట 75 ఇంచుల ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్, యు.పి.యస్. లు అమర్చడం, ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ విద్యకు అవకాశాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో విభాగాల వారీ, మండలాల వారీ ఎంఓఎంబి పాఠశాలల పనుల ప్రగతి పై వివరణాత్మక సమీక్ష నిర్వహించారు. ఆ తరువాత మండల విద్యాధీకారులతో మరియు ప్రధానోపాధ్యాయులతో పాఠశాలలలో జరుగుతున్న పనులు ప్రగతిని, ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్ లు చేపడుతున్న పనుల నాణ్యత గురించి, ఈ జి ఎస్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ జి ఎస్ పనులతో పాటు అన్నీ పనులను ఎట్టి పరిస్థితుల లోనూ పదిహేను రోజుల లోపు పూర్తి చేయాలనీ అధికారులను హెచ్చరించారు. మండల విద్యాధీకారులు తమ పరిధి లోని అన్నీ పాఠశాలలను పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికే మంత్రి గారి అధ్వర్యంలో కొన్ని పాఠశాలలు ప్రారంభించామని, మిగతావి కూడా పనులు పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల యొక్క పనులను త్వరగా పూర్తి చేయించుకోవాలని తెలియజేశారు. చాలా పాఠశాలలో రంగులు కూడా వేయడం జరిగిందని , రీడింగ్ కార్నర్ లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు పనులు పూర్తి దశలో ఉన్నాయని ఆయన తెలిపారు. మిగిలిన అన్నీ పాఠశాలలు పదిహేను రోజుల లోపు పూర్తి చేయడానికి, పూర్తి శ్రద్ధ వహించాలని ఆయన వివరించారు. ఈ సమావేశంలో వివిధ ఇంజనీరింగ్ అధికారులు శంకరయ్య , అశోక్ , గంగాధర్, ఏఈలు, సెక్టోరల్ అధికారులు సామల రాజేశ్వర్ , యన్ ప్రవీణ్ కుమార్ , జి. లింబాద్రి, మండల విద్యాధీకారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రాల పేరుతో దర్జాగా దందా

వరంగల్, జూన్ 15, :మంత్రాల పేరుతో దర్జాగా దందా చేస్తున్నాడు. ఇదే టైంలో పలువురు మహిళలపై కన్నేసి? కోరికలు తీర్చుకున్నాడు. ఎట్టలేకు కేటు బాబా ఆట కట్టించారు వరంగల్ నగర పోలీసులు. 40 ఏళ్ల క్రితం తమిళనాడు నుంచి వచ్చాడు...! వరంగల్ లో సెటిల్ అయ్యాడు. మంచి సెంటర్ చూసి....దందా స్టార్ట్ చేశాడు. పూజలు, మంత్రాలు, మంచి, చెడు అంటూ మాటలు చెబుతూ... స్థానికులతో పాటు వచ్చిపోయే వారిని నమ్మించాడు. మూడు పువ్వులు - ఆరు కాయలు లాగా దందా నడుస్తోంది. ఇక తన దగ్గరికి వచ్చే మహిళలపై కన్నేసి.... శారీరక కోరికలను కూడా తీర్చుకుంటున్నాడు. ఎదురుతిరిగితే బెదిరిస్తాడు. రొటీన్ స్టైల్ లోనే ఓ వివాహితపై కన్నేసి... వరంగల్ పోలీసులకు అడ్డంగా దొరికిపోయాడు ఓ ఫేక్ బాబా. నిందితుడిని అరెస్ట్ చేయటంతో పాటు... రిమాండ్ కు తరలించారు.వరంగల్ లో నగరంలో ఓ కీచక బాబా బాగోతం బట్టబయలైంది. వరంగల్ జిల్లా ఏనుమాముల ప్రాంతంలో షైక్నాలా లబ్బే అనే కీచక బాబాగా అవతరమెత్తాడు. తన మంత్రశక్తులతో కుటుంబంలో ఏమైనా కలహాలు, భార్య భర్తల మద్య తగాధలు మరియు ఆరోగ్య సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తా అని నమ్మించి పలువురు మహిళలు, యువతులను లోబరుచుకుంటున్నాడు. ఇదే క్రమంలో తన దగ్గరికి వచ్చిన ఓ వివాహితపై కూడా కన్నేశాడు. ఆమెకు తన భర్తతో ఉన్న విబేధాలను దృష్టిలో ఉంచుకొని, పూజలు చేస్తునట్టు నటించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ.. తన ఇంట్లోవారికి చెప్పింది. వెంటనే టాస్క్ ఫోర్స్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో కీచక బాబా చీకటి దందా బయటపడింది.వెంటనే రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు కీచక బాబాని అరెస్ట్ చేశారు. తాను తమిళనాడు చెందిన వ్యక్తిని అని... దాదాపు 40 సం. ల క్రితం ఇక్కడికి వచ్చి స్థిరపడినట్లు చెప్పుకొచ్చాడు. అతని వద్ద నుంచి మంత్రాలకు వాడే సామాగ్రి, తాయత్తులు, నిమ్మకాయలు, 25వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇలాంటి బాబాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

**శుక్రవారం 16, జూన్ 2023**

# అభూత కల్పనల 'స్వీట్ రివెంజ్'!

వ్యాసం మొదలవడమే 'రైతు బంధు పేరు మీద రైతులకు ఇతర సహాయాలని నిలిపేశారు' అనే అసత్యంతో మొదలైంది. నిజానికి ఇవ్వాళ దేశంలో మరే రాష్ట్రంలోనూ లేనన్ని రైతు సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్నది. బీడువారిన ఈ గడ్డ మీద ముఖ్యమంత్రి సంకల్పంతో పూర్తవుతున్న ప్రాజెక్టుల వల్ల ఇవ్వాళ సమృద్ధిగా నదీ జలాలు పారుతున్నాయి. ఏ రాష్ట్రంలో ఇవ్వనట్టుగా 24 గంటల ఉచిత విద్యుత్ వ్యవసాయానికి అందుతున్నది. తొలి మలి విడతల్లో సుమారు రూ.17,500కోట్ల రైతు రుణాలను మాఫీ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. సకాలంలో ఎరువులు, నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి రోజుల తరబడి లైన్లలో నిలబడే గోస నుంచి రైతులను తప్పించిందీ ఈ రాష్ట్ర ప్రభుత్వమే. పండించిన ప్రతి గింజనూ స్వంత ఊరిలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొంటున్నది దేశంలో ఈ ఒక్క రాష్ట్రమే. దురదృష్టవశాత్తూ ఏ కారణం చేతనైనా రైతన్న మరణిస్తే పది రోజుల్లోపు అయిదు లక్షల రూపాయల పరిహారం అందించే రాష్ట్రం ఒక్క తెలంగాణ మాత్రమే. ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎన్నో పథకాలు, ప్రాజెక్టులు రైతన్న కోసమే! విడిపోతే ఏం తిని బతుకుతారు? అని వెక్కిరించబడ్డ నేల ఇవ్వాళ దేశానికి బువ్వపెట్టే అన్నపూర్ణ అయ్యిందంటే దానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలే. ఉమ్మడి రాష్ట్రంలో 2013- 14లో తెలంగాణ నుంచి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సేకరించిన మొత్తం ధాన్యం 24 లక్షల మెట్రిక్ టన్నులు అయితే ఇది 2021 నాటికి ఆరు రెట్లకు పైగా పెరిగి 141 లక్షల మెట్రిక్ టన్నులయ్యింది. ఒక్క వరి మాత్రమే కాదు. పత్తి వంటి వాణిజ్య పంటలు, కంది, పామాయిల్ వంటి ఇతర పంటల విస్తీర్ణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. భారీగా పెరిగిన ఇరిగేషన్ సౌకర్యాలు, ఉచిత విద్యుత్, రైతు బంధు పంట పెట్టుబడి సాయం వల్లనే ఈ అద్భుతాలు ఆవిష్కారం అవుతున్నాయి. తెలంగాణ వ్యవసాయ రంగంలో వస్తున్న ఈ విప్లవాత్మక మార్పులను వ్యాస రచయిత జర్నలిస్టు అయి ఉండి కూడా చూడనిరాకరించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. రచయిత ఎంత గందరగోళంలో ఉన్నాడో నిరూపించడానికి ఆయన వ్యాసంలోని పరస్పర విరుద్ధ వ్యాఖ్యలే చాలు. వ్యాసం మూడో పేరాలో 'ఆయా భూములను సాగు చేస్తున్న కౌలుదారులను, రైతు కూలీలను ఇక ఎన్నటికీ యజమానులుగా మారడానికి వీలు లేకుండా (రైతుబంధు-ధరణి) కట్టడి చేసింది' అని రాసిన రచయిత అయిదో పేరా దగ్గరికి వచ్చే సరికి అందుకు సరిగ్గా వ్యతిరేకమైన వ్యాఖ్య చేశాడు: 'విషాదం ఏమిటంటే, తిరిగి ఏ జనమైతే ఆ భూములను సాగు చేసుకుంటున్నారో వారినే కావలిస్తే కొనుక్కోమని ఒత్తిడి తెచ్చేలా చేసింది ఈ (రైతుబంధు-ధరణి) పథకం.' ధరణి, రైతుబంధు వల్ల కౌలుదార్లు ఎప్పటికీ యజమానులుగా మారలేరు అన్న ఒక్క నిముషం లోపే ధరణి-రైతుబంధు కౌలుదార్లను ఆ భూములు కొనుక్కోమని ఒత్తిడి చేస్తోంది అనడం ఆయనలోనే ఈ రెండిటి పట్ల వ్యాస రచయితకు స్పష్టత లేదని అర్థమవుతున్నది. రైతుబంధు అనేది భూస్వాముల కోసమే తెచ్చినదనీ, దీనివల్ల రెడ్డి, వెలమ కులస్థులకే లబ్ధి చేకూరుతుందనీ కందుకూరి రమేశ్ బాబు చేసిన ఆరోపణ అర్థరహితం. జర్నలిస్టుగా ఎంతో అనుభవం ఉన్న వ్యాసకర్త ఏ ఆధారం లేకుండా రెండు కులాల పేరు పెట్టి విషం చిమ్మడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. రాష్ట్ర వ్యవసాయ శాఖ రైతుబంధు లబ్ధిదారులు ఎవరో అనేకసార్లు గణాంకాలను విడుదల చేసింది. వీటిని ఒక్కసారైనా వ్యాసకర్త పరిశీలించి ఉంటే తన వాదన ఎంత ఆధారరహితమో ఆయనకే అర్థమయ్యేది. మొత్తం 65 లక్షల రైతు బంధు లబ్దిదారుల్లో 91.1శాతం 10 ఎకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులే. నిజానికి లాండ్ సీలింగ్ యాక్ట్ వచ్చినంక 50 ఎకరాలకు పైబడి భూమి ఒకరి వద్ద ఉండటానికే వీలు లేదు. 25-50 ఎకరాల కమతం కలిగి ఉన్న రైతులనే కనుక మనం భూస్వాములు అని వర్గీకరిస్తే వారు రాష్ట్రం మొత్తం మీద 6,000లోపు ఉన్నారు. మొత్తం రైతు బంధులో వారికి అందేది 0.1శాతం మాత్రమే. అంటే 99.9 శాతం పేద రైతులకు అందుతున్న ఈ పథకాన్ని 0.1శాతం పెద్ద రైతులకు అందుతున్నది కాబట్టి కుట్ర అంటున్నాడు రచయిత! మొత్తం ఉన్న 65 లక్షల లబ్ధిదారుల్లో 12.67శాతం ఎస్టీలు, 13.14శాతం ఎస్సీలు, 53.55శాతం బీసీలు కాగా ఇతర కులాల వారు 20.64శాతంగా ఉన్నారు. అంటే ఎస్టీ, ఎస్సీ, బీసీ వర్గాలకు 79 శాతం లబ్ధి చేకూరితే 21శాతం ఇతరులు లబ్ధిదారులుగా ఉన్నారన్నమాట. వాస్తవం ఇదైతే మరి రచయిత ఎందుకు కేవలం రెండు కులాల మీదికే విల్లు ఎక్కుపెట్టాడో తెలియదు. కౌలు రైతులకు రైతు బంధు ఇవ్వడం ఎందుకు సాధ్యం కాదో కూడా ఇదివరకే అనేకసార్లు వివరణ ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలోని అత్యధిక రైతులు భూములు కౌలుకు తీసుకున్నప్పుడు కానీ ఇచ్చినప్పుడు కానీ నోటిమాటగానే తీసుకుంటారు, లేదా ప్రైవేటు కాగితం ద్వారా ఒప్పందాలు చేసుకుంటారు. ఈ ప్రైవేటు ఒప్పందాలకు చట్టబద్ధత లేనందున, కౌలు రైతులు కూడా ఏటా మారుతుండటం వలన ప్రభుత్వానికి కౌలుదార్లను గుర్తించడం కష్టతరం. అంతే కాదు రైతును కాదని కౌలు రైతుకు ప్రభుత్వం నేరుగా ఆర్థిక సహాయం అందిస్తే అది వారిద్దరి మధ్యా స్పర్థలకు కూడా దారితీసి అంతిమంగా అసలు ఎవరూ భూమిని కౌలుకు ఇవ్వకపోయే ప్రమాదం కూడా ఉన్నదని గమనించాలి. రైతు బంధును చూసి కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రధాన్ మంత్రి కిసాన్ యోజనలో కూడా కౌలు రైతులు అర్హులు కారు. మరి ఇక్కడ గోలపెట్టే ప్రతిపక్షాలు, ఇతరులు కేంద్రాన్ని ఎందుకు పల్లెత్తు మాట అనరు? అక్కడో న్యాయం ఇక్కడో న్యాయమా? ఇక 'ధరణి' అనేది ఒక విప్లవాత్మక సంస్కరణ. ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లభ్యం కావడం అనేది ఎంతో పారదర్శకతను తెచ్చింది. ఇప్పుడు ధరణి ద్వారా ఏవైతే సమస్యలు వచ్చినయో అందులో 99 శాతం ఇదివరకే భూ రికార్డులలో ఉన్న సమస్యలు. ధరణి రావడం వల్ల అవి ఇప్పుడు బయటపడ్డాయి కానీ ఆ సమస్యలు ధరణి వల్ల ఉత్పన్నం కాలేదు. ఆ సమస్యలు కూడా ఒక్కటొక్కటిగా పరిష్కారం అవుతున్నాయి. రెండేళ్లలో 26 లక్షలకు పైగా లావాదేవీలు ధరణి ద్వారా అయ్యాయి అంటేనే ఈ విధానం విజయవంతం అయ్యిందని అర్థమవుతుంది. అయినా, కొందరు భూస్వాములకే లబ్ధి చేకూర్చాలనుకుంటే రికార్డులు ఎవరికీ కనపడకుండా ఉండే విధానాన్ని తెస్తారు గానీ వాటిని ఆన్‌లైన్‌లో పెట్టి పారదర్శకత పెంచి, ప్రజాబాహుళ్యంలోకి తీసుకురారు. ఇంత చిన్న లాజిక్ రచయిత ఎట్లా మిస్సయ్యాడో మరి! ఎటువంటి ఆధారాలు లేకుండా ఒక అవకతవక వాదన తీసుకొచ్చి దాన్ని తెలంగాణ ఏర్పాటే ఒక కుట్ర అనే స్థాయికి రచయిత తీసుకుపోవడం దురదృష్టకరం. ఇది తెలంగాణ ప్రజల విజ్ఞతను అవమానించడమే!

# రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు - ఒక పరిశీలన




బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పెద్ద ఎత్తున వేగంగా అమలు జరుగుతున్నాయి. మోడీ ప్రభుత్వం చెబుతున్నదల్లా చేస్తున్న వైసిపి ప్రభుత్వం కూడా రాష్ట్రంలో ఇవే విధానాలు అమలు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ కాలంలో 6,16,323 ఉద్యోగాలు కల్పించామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా ప్రకటిస్తోంది. వాటిలో 3,71,777 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కాగా 37,908 కాంట్రాక్ట్ ఉద్యోగాలు. మిగిలిన 2,06,638 రెగ్యులర్ ఉద్యోగాలని చెబుతున్నారు. వీరిలో 1,25,110 మంది గ్రామ / వార్డు సచివాలయ ఉద్యోగులు. 51,387 మంది ఆర్‌టిసి ఉద్యోగులు. రాష్ట్ర అధికారిక లెక్క ప్రకారం 10,98,012 ఉద్యోగులు ఉండగా 2,61,311 మంది పాత పెన్షన్ విధానం అమలయ్యే రెగ్యులర్ ఉద్యోగులు. 3,08,984 మంది సిపిఎస్ ఉద్యోగులు. మిగిలిన 5,27,717 మంది ఏ పెన్షన్ లేని వారు. అంటే సుమారు 48 శాతం మంది ఉద్యోగులు ఏ భద్రత లేనివారు, మరొక 28.2 శాతం ఉద్యోగులు అరకొర భద్రత కలిగినవారు. పూర్తి భద్రత కలిగిన ఉద్యోగుల సంఖ్య 23.8 శాతం మాత్రమే. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జాబ్ క్యాలండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తామని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తానని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని, 27 శాతం ఐ.ఆర్ ప్రకటించి దానికంటే మేలైన వేతన సవరణ అమలు చేస్తానని, డిఏలు రెగ్యులర్‌గా సకాలంలో చెల్లిస్తానని అనేక వాగ్దానాలు చేశారు. కాని, ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. గ్రామ / వార్డు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు మినహా మరే కొత్త ఉద్యోగాలు సృష్టించలేదు సరికదా ఉన్న రెగ్యులర్ ఖాళీలేవీ భర్తీ చేయలేదు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో ఉద్యోగ సంఘాల జెఏసిలు సమస్యలపై పోరాటం ప్రారంభించాయి. మరోవైపు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాలు కూడా సమస్యలపై కార్యాచరణకు పిలుపునిచ్చాయి. పరిస్థితులు వ్యతిరేకంగా మారుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం హడావిడిగా జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి కొన్ని నిర్ణయాలు వెల్లడించింది. చర్చకు పెద్దగా అవకాశమివ్వకుండా వాటినే జూన్ 7వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదించినట్లుగా ప్రకటించారు. మంత్రివర్గ నిర్ణయాలలో అతి ముఖ్యమైనది పెన్షన్ సమస్య. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 4 సంవత్సరాలు గడిచినా హామీ నిలుపుకోకపోవడంతో సిపిఎస్ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గం సిపిఎస్ రద్దు చేస్తున్నట్లు, దాని స్థానంలో "గ్యారంటీ పెన్షన్ స్కీమ్" (జిపిఎస్) అమలు చేయనున్నట్లు ప్రకటించింది. మూల వేతనంలో 50 శాతం పెన్షన్‌గా ఇస్తామని, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా డియర్‌నెస్ రిలీఫ్ కూడా ఇస్తామని చెబుతున్నది. పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తే 2041 నాటికి 65,234 కోట్లు పెన్షన్లకే చెల్లించాల్సి వస్తుందని, 2070 నాటికి అది 3,73,000 కోట్లకు చేరుతుందని లెక్కలు చూపుతున్నారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై మోయలేని భారం పడుతుందని, అందుకే ఉభయ తారకంగా జిపిఎస్ తెచ్చామని చెబుతున్నారు. అంతేగాదు తమ విధానమే దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శమవుతుందని గొప్పలు చెబుతున్నారు. దేశంలో సిపిఎస్ విధానం అమలులోకి తెచ్చేటప్పుడు ఆనాటి బిజెపి ప్రభుత్వం కూడా రిటైర్ అయిన తర్వాత లక్షలాది రూపాయలు ప్రయోజనం కలుగుతుందని, పాత పెన్షన్ విధానం కంటే ఎక్కువ పెన్షన్ లభిస్తుందని ఉద్యోగులను భ్రమలకు గురి చేసింది. దానికి కాంగ్రెస్ కూడా వంతపాడింది. 20 సంవత్సరాలు గడిచాక దాని అసలు స్వరూపం ఏమిటో అందరికీ అర్థమైంది. అందుకే ఎవరు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామంటే వారికి ఉద్యోగులు అండగా నిలుస్తున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తున్నారు. తాజాగా జరిగిన హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ఎన్నికల ఉదంతం పరిశీలిస్తే అర్థమవుతుంది. పాత పెన్షన్ విధానం అమలు చేస్తానన్న కాంగ్రెస్‌కే పట్టం గట్టారు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం టక్కర్ కమిషన్‌ను నియమించింది. దాని సిఫారసుల మేరకు 50 శాతం పెన్షన్ కూడా ఇస్తామని చెప్పింది. కాని, పాత పెన్షన్ విధానం అమలు చేస్తానన్న జగన్‌కే ఉద్యోగులు ఓట్లు వేశారు. అధికారంలోకి తెచ్చారు. తీరా ఇప్పుడు జిపిఎస్ అమలు చేస్తామని మంత్రివర్గం ప్రకటించడంతో ప్రభుత్వం తమని మోసగించిందని ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. సిపిఎస్ రద్దు కోసం పోరాటం అంటే ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా యుటిఎఫ్ నాయకత్వం 65 మందిపై అనేక రకాల సెక్షన్లు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు. అంతే తప్ప పాత పెన్షన్ విధానం కోసం పోరాడుతున్న సంఘాలతో ముఖ్యమంత్రిగాని, రాష్ట్ర ప్రభుత్వం గాని జిపిఎస్‌పై చర్చించలేదు. కేవలం తమకు అనుకూలమైన జెఏసి నాయకులతోనే చర్చించి నిర్ణయాన్ని ప్రకటించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని చెబుతున్న గ్యారంటీ పెన్షన్ విధానం పట్ల కూడా ఉద్యోగుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిపిఎస్ విధానం ఆచరణలో కాగితాలకే పరిమితమవుతుందా? పిఎఫ్‌ఆర్‌డిఏ చట్టం నుండి వైదొలగకుండా ఏ విధంగా అమలు చేస్తారు? జిపిఎస్‌కు చట్ట బద్ధత ఏమిటి? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. మంత్రివర్గ నిర్ణయాల్లో మరొక ప్రధానాంశం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో సుమారు 18 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరుగాక వివిధ కార్పొరేషన్లు, సొసైటీలు, యూనివర్శిటీలు, స్థానిక సంస్థలలో పనిచేసే టైమ్‌స్కేల్, ఫుల్‌టైం కంటింజెంట్, డైలీ వేజ్, పార్ట్‌టైమ్ కంటింజెంట్ ఉద్యోగులు మరో 50 వేల మంది ఉంటారని అంచనా. పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా నియమితులైన ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ 2 నాటికి ప్రభుత్వ విభాగాలలో నోటిఫికేషన్ ఇచ్చి రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు అనుగుణంగా నియమితులైన వారు 10,117 మంది ఉన్నారు. వీరిలో రాష్ట్ర విభజన నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు మంత్రివర్గం ప్రకటించింది. అంటే, మొత్తం కాంట్రాక్టు ఉద్యోగుల్లో కేవలం 6,666 మంది మాత్రమే రెగ్యులరైజ్ అవుతారు. మిగిలిన వారి సంగతి ఏమిటన్నది స్పష్టత లేకపోవడంతో కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. తమను కూడా రెగ్యులర్ చేయాలని వారు కోరుతున్నారు. మరొక ముఖ్య నిర్ణయం 12వ పిఆర్‌సి ఏర్పాటు. గత పిఆర్‌సి సందర్భంగా కనీసం రిపోర్టు కూడా బయటపెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఉద్యోగులు ఇంకా మరచిపోలేదు. ఇచ్చిన ఐ.ఆర్. 27 శాతం కంటే తక్కువ 23 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చి పిఆర్‌సి అమలు చేశారు. మొత్తం డిఏలన్నిటిని ముద్దగా కలిపేశారు. పిఆర్‌సి, డిఏ అరియర్లు రూ.7,382 కోట్లు ఇప్పటివరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదు. పైగా నాలుగేళ్లలో వాయిదాల రూపంలో చెల్లిస్తామని చెబుతున్నారు. ఎన్నికలు జరిగే నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఒక వాయిదా అంటే 175 కోట్లు మాత్రమే చెల్లిస్తుంది. మిగిలిన బకాయి సంగతేమిటి? ఇలాంటి పరిస్థితుల్లో గత పిఆర్‌సి బకాయిలు చెల్లించకుండానే ఇప్పుడు కొత్త పిఆర్‌సి అని ప్రకటిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించిన 12వ పిఆర్‌సి ఎప్పుడు తన నివేదిక ఇస్తుందో, పిఆర్‌సి ఎప్పుడు అమలుకు నోచుకుంటుందో, పిఆర్‌సి అరియర్లు ఏ విధంగా చెల్లిస్తారో తెలియదు. అంటే ఈ ప్రకటన రానున్న ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకుని చేసినది తప్ప మరొకటి కాదు. జిల్లా కేంద్రాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం, వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లింపు, సొసైటీలు, యూనివర్శిటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంపు వంటి నిర్ణయాలు కొద్దిమందికి ప్రయోజనం కలిగించే అంశాలుగా ఉన్నప్పటికీ ప్రధానంగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, బకాయిల చెల్లింపులపై అరకొర నిర్ణయాలు ఎవరికీ సంతృప్తికరంగా లేవు. కాబట్టి, రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాలు పునఃసమీక్షించాలి. ప్రకటించిన గ్యారంటీ పెన్షన్ విధానానికి బదులుగా పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంపుదల చేయాలి. వీటి సాధనకై ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఐక్య ఉద్యమాలకు కదలి రావాలి.

# నీరు మన జీవనాధారం

క్యారెల్‌కు నాలుగు బిందెలు కట్టుకొని
పోరడు కస్తీగా సైకిల్ తొక్కంగ
సొమ్మసిల్లిన చైన్ కక్ష్య దాటిన చప్పుడు
బతుకు లంకెను పణం చేసింది
వాలిపోయిన భుజాల
వట్టి పోయిన ఆశలు
నడుం బొక్కలరిగి
వాకిలి కూలిన అక్క చెల్లెలు
వెన్ను వంగిన అమ్మా నాయ్నలనేమని
పలకరిస్తరు ?

దశాబ్దాలు దశాబ్దాలుగా
ఈ ఎడారుల సంచారంలో
వచ్చిపోయే నీటి భ్రమల కోసం
కాలుతున్న గచ్చు మీదా
కందెనింకిన గిరక మీదా
కాళ్లు తడవని నేలమీదా
ఆనని బొక్కెన వెక్కిరింపులు సహించలేదా
!

పుట్టుకకు చావుకూ
ముందే పుట్టిన ఈ నీటి బొట్టు
ఎవరి దురదృష్టమవుతున్నదని !
కలవరిస్తున్న నీటికన్ను నిప్పుల జ్వాల
తెగింపు భగీరథుని వాగ్దానం చేసింది
పరితపించే తాపసులకే ఎరుక
కూకటి వేరు గుబురులోకి పోయి
నీటి తుట్టెను కదిలించటం ఎట్లనో
ప్రవాహాన్ని మళ్లించడం ఎట్లనో
పారే నరాలను అనుసంధానం చేయటం
ఎట్లనో
పరితపించే తాపసులకే ఎరుక
కాలుష్యం చుక్కరాలని
ఊసుల కన్నులకు ఊరడింపు ఎట్లనో
పొక్కిలైన వాకిలిని
తలవంచిన మేఘాన్ని
వెన్నెలనుజి
పిలుచుకోవాలెట్లనోజి



ఎదురు చూపుల ఆత్రానికి
కడగండ్లు కడిగే మిషన్
కదన రంగాన కాలు దువ్వుకుంటూ
పరవళ్లు తొక్కుతున్నది
బతుకు ప్రధాన జీవనాధారం నీరు

ఉపరానంత ఆశలకు ప్రాణం పోస్తూ
వాకిట ఉదయిస్తున్నది
ఏ సూక్ష్మ కణాన్ని శోధించు

మళ్లి పోయిన ఊటలన్నీ ఒకటొకటిగా
బతుకు జలాశయంలోకి చేరుకుంటున్న
జీవ నదుల సవ్వడులే
ఉప్పొడి పులకిస్తున్న
ఆనందాల బాష్పధారలే
రెండు కొలుకుల రెప్పల నిండా
తెలంగాణమంత
హరివిల్లులై పూచే పూలదండలే.

**బెల్లంకొండ సంపత్ కుమార్**

## సీఎం సహాయనిధి పేదలకు వరం: ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



మేడిపల్లి, జూన్15 (ప్రజాపాలన ప్రతినిధి): సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి నివాసంలో ఆయన చేతుల మీదుగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు.లబ్ధిదారులు సహస్ర (ఎల్ వో సి) రూ 2,50,000/ సుబ్బలక్ష్మి రూ 48 వేలు, మహేష్ రూ 36 వేలు, సబిత రూ 24 వేలు, లిఖిత రూ 22 వేలు చెక్కులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనంపల్లి వెంకటేశ్వర రెడ్డి, గరిక సుధాకర్, మేకల ముత్యంరెడ్డి, వేముల సంతోష్ రెడ్డి, డాక్టర్ బి.వి చారి, లక్ష్మీనారాయణ, పిట్టల నరేష్ ముదిరాజ్, నందికంటి శివ, కొంగల శ్రీధర్, వెంకట్ రెడ్డి, సాయి ,రాణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి



సైదాపూర్/ ప్రజా పాలన/ మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం భూలక్ష్మి వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాయిత రాములు మాట్లాడుతూ... ఈనెల 2న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దశాబ్ది ఉత్సవాలు దశలవారీగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ ప్రజలను భాగస్వామ్యం చేయడం జరుగుతుందన్నారు. జూన్ 2న గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ ,3న రైతు దినోత్సవం, 4న సురక్ష దినోత్సవం, 5న తెలంగాణ విద్యుత్ వజ్రోత్సవాలు,6 న తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం, 7 న సాగునీటి దినోత్సవం, 8న చెరువుల పండగ, 9న తెలంగాణ సంక్షేమ సంబరాలు, 10న తెలంగాణ సుపరిపాలన దినోత్సవం ,11న తెలంగాణ సాహిత్య దినోత్సవం ,12న తెలంగాణ రన్, 13న మహిళా సంక్షేమ దినోత్సవం, 14న వైద్య ఆరోగ్య దినోత్సవంతో పాటు గ్రామపంచాయతీ పరిధిలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు .గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండేది, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలనలో ఎలా ముందుకు పోయిందని విషయాలను ప్రజలు మననం చేసుకోవాలని గుర్తు చేశారు. 24 గంటల విద్యుత్ తో పాటు రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి ,షాది ముబారక్ తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి ,వార్డు సభ్యులు రేగుల సురేష్, మాతంగి వెంకటయ్య, దొనపాటి రమాదేవి, మ్యాదరి శిరీష, వివో ఏ శ్రీలత, మహిళలు, యువతులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ శ్రమశక్తి అవార్డు అందుకున్న బోనకల్ పంచాయతీ వర్కర్స్

### అభినందనలు తెలిపిన సిపిఎం పార్టీ బోనకల్ గ్రామ శాఖ



బోనకల్, జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో పల్లె ప్రగతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య సైదా నాయక్ జాతీయ జెండాని ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. బోనకల్ గ్రామపంచాయతీకి ఉత్తమ సేవలు అందించినందుకు గాను పంచాయతీ వర్కర్స్ కి ఉత్తమ శ్రమశక్తి అవార్డును సర్పంచ్ సైదా నాయక్, ఎంపీటీసీ గుగులోతు రమేష్, పంచాయతీ కార్యదర్శి దామర్ల కిరణ్ కుమార్ చేతుల మీదగా అందజేశారు. ఉత్తమ శ్రమశక్తి అవార్డును అందుకున్న బోనకల్ గ్రామపంచాయతీ వర్కర్స్ అందరికీ బోనకల్ సిపిఎం గ్రామ శాఖ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెల్లాకుల శ్రీనివాస్, వార్డు నెంబర్ ఉప్పర శ్రీను, యుపిఎస్ ఎస్ఎంసి చైర్మన్ బొబ్బిళ్ళ పాటి రాజు, మాజీ సర్పంచ్ భూక్య జాలు, బోనకల్ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు బిళ్ళ విశ్వనాథం, నాయకులు చెన్న లక్ష్యాద్రి, గద్దే రామారావు పాల్గొన్నారు.

## నక్కలగరుబులో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

### పల్లె ప్రగతి కార్యక్రమంలో జాతీయ జెండా ఎగురవేసిన గ్రామ సర్పంచ్ వెంకట్రావమ్మ



మధిర, జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని నక్కలగరుబు(బుచ్చిరెడ్డిపాలెం)లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ముందుగా పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మునగా వెంకట్రావమ్మ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి భారీ ర్యాలీతో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హేమలత,పంచాయతీ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

# భట్టి పుట్టినరోజు సందర్భంగా ఘనంగా సంబరాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





మధిర జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి:మధిర సాయిబాబా దేవాలయంలో భట్టి విక్రమార్క వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో జీవించాలని బట్టి విక్రమార్క చేస్తున్న పాదయాత్ర లక్ష్యం నెరవేరాలని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.మధిర మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూరంశెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణ గుప్తా కేక్ కట్ చేశారు.మధిర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో అద్దంకి రవికుమార్ కేక్ కట్ చేశారు.లదక్ బజార్ యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న భట్టివిక్రమార్క ప్రియ అభిమాని మొహమ్మద్ రహీం ఘనంగా నిర్వహించారు.మధిర ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్ నిర్వహించారు.మధిర సాయిబాబా ఆలయంలో అన్నదానం కార్యక్రమం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు నిర్వహించి ఘనంగా జరుపుకున్నారు. గురువారం మధిర నియోజకవర్గ శాసనసభ్యులు, పేదల పాలిటి పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరంతర శ్రామికుడు లిమల్లు భట్టి విక్రమార్క పుట్టినరోజు సందర్భంగా మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. మధిర మండల కాంగ్రెస్ పార్టీ లిసూరంసెట్టి కిషోర్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లిమిరియాల వెంకటరమణ గుప్తాలి కేక్ ని కట్ చేసి లిభట్టి విక్రమార్కలి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్లి ప్రత్యేకంగా తయారు చేయించిన కేక ని కట్ చేసి భట్టివిక్రమార్క గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.. లదక్ బజార్లో లదక్ బజార్ యూత్ కాంగ్రెస్ తరపున లిమహమ్మద్ రహీంలి ఏర్పాటు చేసిన కేక్ ని కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు అనంతరం మధిర పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఆర్కే ఫౌండేషన్ అనాధాశ్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకి రవికుమార్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి అన్న వితరణ చేశారు.. మధిర పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో భట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో జీవించాలని కాంగ్రెస్ పార్టీని అధికారాన్ని తీసుకురావడవే లక్ష్యంగా పనిచేస్తున్న భట్టి విక్రమార్క గారి ఆశయం నెరవేరాలని సాయిబాబా వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లిరంగా హనుమంతరావులి గారు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పేదలకు అన్న వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో మధిర మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లిదారా బాలరాజులి మున్సిపాలిటీ కౌన్సిలర్ లికోనాధని కుమార్లి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ లితూమాటి నవీన్ రెడ్డిలి కిసాన్ సెల్ అధ్యక్షుడు లిదుంప వెంకటేశ్వర రెడ్డిలి మండల బీసీ సెల్ అధ్యక్షుడు లిచిలువేరు బుచ్చి రామయ్యలి మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు లికోరంపల్లి చంటిలి పట్టణ ఐఎన్టియుసి అధ్యక్షుడు లిషేక్ బాజీలి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు లిబిట్రా ఉద్దండయ్యలి ఎస్సీ సెల్ అధ్యక్షుడు లిగద్దల లాలయ్యలి పట్టణ డివిజన్ కమిటీ అధ్యక్షులు లితలుపుల వెంకటేశ్వర్లు, కోటా డేవిడ్ మాగం ప్రసాద్ బండారి నరసింహారావు కోట నాగరాజు బుల్లెద్దు రాజేంద్ర గద్దల విజయ్ వెూదుగు బాబు ఆదిమూలం శ్రీనివాసరావు వైలవరపు చక్రి మొహమ్మద్ రహీంలి మండల కాంగ్రెస్ నాయకులు లిమువ్వా వెంకయ్య బాబు సంపసాల రామకృష్ణ కరీముల్లా ఐలూరు సత్యనారాయణ రెడ్డి మదార్ సాహెబ్ ఉట్ల రాంబాబులి మరియు వివిధ హెూదాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వారాలు గడిచినా రోజు కూలీ ఎంత వస్తుందో తెలియక అయోమయంలో ఉపాధి కూలీలు





ఇబ్రహీంపట్నం జూన్ 15ప్రజాపాలన ప్రతినిది :ఎండలో మాడిపోతు పని చేస్తు చేతులకు బొబ్బలు వచ్చిన రెక్కాడితే డొక్కాడని కూలీలు కుటుంబ పోషణ కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న రోజు కూలీ ఎంత వస్తుందో తెలియక అయోమయానికి గురై కార్మికుల ఆవేదన చెందుతున్నారని, పనిచేస్తున్న కార్మికులకు పే స్లిప్ లు, డబ్బులు ఎందుకు ఇవ్వరని, సంవత్సరం నుండి కార్మికులకు పే స్లిప్ లు, పెండింగ్ బిల్లులు చెల్లించకుండా మండలం ఉన్న ఏపిఓ,టిఎలు ఏమిచేస్తున్నారని ఇప్పటికైనా పే స్లిప్ లు వారం వారం ఇచ్చి, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీపీయం మండల కార్యవర్గ సభ్యులు పి జగన్ డిమాండ్ చేశారు. గురువారం లిఇబ్రహీంపట్నం మండలం ముకునూరు గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకున్నారు, అనంతరం ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పి జగన్ మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా పేదలు వ్యవసాయ కార్మికులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేసి పార్లమెంటులో వామపక్ష పార్టీల ఎంపీల ఆందోళన ఫలితంగా వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరము ఉపాధి హామీ పనికి నిధులు కోత విధిస్తూ కొత్త కొత్త జీవోలను విడుదల చేస్తూ చట్టాన్నె నీరుగార్చేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 2005లో చట్టము వచ్చినప్పుడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో పనిచేసే కార్మికులకు వారు చేస్తున్న పనికి రోజువారి కూలి ఎంత వస్తుందో తెలియజేయడానికి పే స్లిప్ లు ఇవ్వాలని ఉన్న ఎందుకు ఇవ్వడం లేదని ప్రభుత్వాన్ని అధికారులను ప్రశ్నించారు. వారం వారం చేసిన పని డబ్బులు చెల్లించాలని ఉన్నా నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో పని చేస్తున్న కార్మికుల కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని ప్రశ్నించారు. చట్ట ప్రారంభదశలో కూలీల పని ప్రదేశం దగ్గర తాగడానికి మంచినీళ్లు, నీడ కోసం టెంటు, పని ప్రదేశంలో గాయపడితే మెడికల్ కిట్టు, చంటి పిల్లలను ఎత్తుకోవడానికి కూడా పని మనుషులు ఉండేవారు కానీ రాను రాను వీటన్నింటినీ తగ్గించి కూలీలను ఉపాధి పనికి రాకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితి ఉన్నదని అన్నారు.

17 సంవత్సరాల క్రితం పనిచేసే కూలీలకు పనిముట్లు ఇవ్వగా ఆ తర్వాత నాటి నుండి నేటి వరకు ఏ ఒక్కరికి కూడా నూతన పనిముట్లు ఇవ్వలేదని, పనిముట్లు పనికి యోగ్యంగా తయారు చేసుకోవడానికి డబ్బులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర వస్తువులు పెద్ద ఎత్తున పెరుగుతుంటే ఉపాధి హామీ పథకంలో 272 రూపాయలు ఇవ్వాలని ఉన్న కేవలం 100 నుండి 150 రూపాయలు దాటడం లేదని దీంతో కూలీల కుటుంబాలు ఏ విధంగా గడుస్తాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టంలో ఉన్న ప్రకారం పని ప్రదేశాల్లో మౌలిక సమస్యలు పరిష్కారం చేయాలని, సంవత్సరానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకూలీ 600 రూపాయలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని, పని ప్రదేశంలో గాయపడిన వారికి వైద్యం ఖర్చు తో పాటు పనిచేయని రోజులలో డబ్బులు చెల్లించాలని, ఉపాధి కూలీలకు వారంరోజులల్లో పెండింగ్ బిల్లులు, పే స్లిప్ లు ఇవ్వకపోతే కార్మికులతో మండల పరిషత్ కార్యాలయం ముట్టడి చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కాకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సఫాయన్న.. సలామ్ అన్న..: సర్పంచ్ కాయిత రాములు



సైదాపూర్/ ప్రజా పాలన, నేడు గ్రామాలు పరిశుభ్రంగా పచ్చదనంతో ఉన్నాయంటే దానికి సఫాయి కార్మికులే ప్రధాన కారణమని సర్పంచ్ కాయిత రాములు అన్నారు. గురువారం మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామపంచాయతీలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నర్సరీ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామాలను సందర్శించడం జరిగింది. ర్యాలీ అనంతరం సర్పంచ్ కాయిత రాములు జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ...పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం వల్లే నేడు గ్రామాలు పచ్చదనం,పరిశుభ్రతతో వర్ధిల్లుతున్నాయని అన్నారు.విరిగిపోయిన, వంగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త ఫోల్ లను ఏర్పాటు చేయడం, లూజు లైన్లను సరి చేయడం, రోడ్లకు ఇరువైపులా చెట్లను నాటడం ప్రతిరోజు చెత్తను సేకరించడం లాంటి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ప్రకృతి వనాన్ని నిర్మించడం, డంపింగ్ యార్డ్ నిర్మించడం, స్మశాన వాటిక నిర్మించడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీకి సొంతంగా ట్రాక్టర్, ట్రాలీ, ట్యాంకరు కొనుగోలు చేయడం వల్ల ఎన్నో సౌకర్యాలు సమకూర్తున్నాయని పేర్కొన్నారు. ఏప్పటికప్పుడు రోడ్లను, మురికి కాలువలను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. మహిళలు తమ ఇండ్లలోని చెత్తను తడి చెత్తగా, పొడి చెత్తగా వేరుచేసి సఫాయిలకు అందించాలని కోరారు.నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఉన్న తెలంగాణ నేడు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు కావడం వల్లే గ్రామాలు, మండలాలు, జిల్లాలు అభివృద్ధి పథంలో వెళుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న చర్యల వల్లే నేడు సాగునీరు, తాగునీరు రైతులకు 24 గంటల విద్యుత్తు, తో పాటు రైతుబంధు,రైతు బీమా అందుతుందన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెడుతున్న బడ్జెట్లో సుమారు 45 వేల కోట్లను ప్రజల సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టాడన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు వల్లే నేడు దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ గా నిలిచిందని పేర్కొన్నారు. దేశంలోని మహారాష్ట్ర ,కర్ణాటక, చత్తీస్గఢ్ తదితర రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రంలోని పథకాలను తమకు ప్రవేశపెట్టాలని ఆయా ప్రభుత్వాలపై ప్రజలు ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. మన గ్రామం కొత్త గ్రామపంచాయతీ గా ఏర్పడిన నుండి అభివృద్ధి పథంలో ముందుకు పోతుందని చెప్పారు. రాబోయే రోజుల్లో మన గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే మొదటి స్థానంలో నిలబెడతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ప్రజలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అనంతరం సపాయి కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మ్యాకల మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి ,ప్రధానోపాధ్యాయురాలు కవిత, స్పెషల్ అధికారి రమేష్ ,సింగల్ విండో డైరెక్టర్ దొనపాటి రామ్ రెడ్డి, వార్డు సభ్యులు రేగుల సురేష్, దొనపాటి రమాదేవి, బండ సరోజన, మాతంగి వెంకటయ్య, కోఆప్షన్ సభ్యులు పెసర అశోక్, అంగన్వాడి టీచర్ స్వరాజ్యం, వివో ఏ శ్రీలత, ఆశ వర్కర్ నిర్మల ,గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తగట్టు పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న కవ్వంపల్లి



శంకరపట్నం జూన్ 15 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి జాతరకు ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య, పీసీసీ సభ్యుడు మాజీ జడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఎడ్ల శివ, హిసమోద్దిన్, తిరుపతి, గరిగే ప్రభాకర్, ఎడ్ల రాజు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొనగా వీరిని ముదిరాజ్ సంఘము గౌరవ అధ్యక్షుడు పప్పు ప్రభాకర్, అధ్యక్షుడు ఎడ్ల తిరుపతి, ఉపాధ్యక్షుడు పప్పు రాజు, ముదిరాజ్ సంఘ సభ్యులు శాలువాతో సన్మానించారు.

## పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించిన గ్రామ పాలకవర్గం



శంకరపట్నం జూన్ 15 ప్రజాపాలన రిపోర్టర్: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా పల్లెలను గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దిన పరిశుభ్రంగా ఉంచిన గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి గ్రామ సర్పంచ్ బండారి స్వప్న ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య సిబ్బంది గ్రామానికి చేసిన సేవలను కొనియాడుతూ నూతన వస్త్రాలను, బూట్లు ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కేశపట్నం గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బొజ్జ కవిత వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవం



శంకరపట్నం జూన్ 15 ప్రజాపాలన రిపోర్టర్:దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం శంకరపట్నం మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు కార్యదర్శులు గ్రామస్థాయి ఉద్యోగులు గ్రామాల్లోని ప్రజలతో కలిసి ర్యాలీగా వెల్లి ఆయా గ్రామాల్లోని పల్లె ప్రగతి పనులను, కంపోస్ట్ షెడ్, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, ఎవెన్యూ ప్లాంటేషన్ తదితర అభివృద్ధి పనులను సమీక్షించారు. ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొని పల్లె ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఘనంగా పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమం




కోరుట్ల, జూన్ 15 ( ప్రజాపాలన ప్రతినిధి):తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పల్లె ప్రగతి దినోత్సవ కార్యక్రమం గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.జాతీయ జెండా ఆవిష్కరణ చేసి పంచాయతీ సిబ్బంది, మరియు పాలక వర్గం గ్రామంలో ర్యాలి నిర్వహించారు.అనంతరం పంచాయతీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుంపల నర్సు రాజనర్సయ్య, ఉప సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి , వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి హకీమ్, డాక్టర్ ప్రతిష్ట, ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడీలు, సిఏలు, మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణలో బీజేపీదే అధికారం: ఇల్లిటం నర్సింహారెడ్డి



మేడిపల్లి, జూన్15(ప్రజాపాలన ప్రతినిధి) వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పార్టీ అఖండ విజయని సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఉప్పల్ బీజేపీ అధికార ప్రతినిధి ఇల్లిటం నరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రామంతాపూర్ ప్రగతినగర్లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరసింహ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఏమి లేదని, కేంద్రం పథకాల నిధులు మళ్లించి తమ అభివృద్ధి అని ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్ కు, బీఆర్ఎస్ కు ప్రజలు అధికారం కల్పించారని, ఒక్కసారి బీజేపీకి ప్రజలు అధికారం ఇస్తే ఎంత అభివృద్ధి చేసి చూపిస్తామో చూడండి అని అన్నారు. అప్ కి బార్ మోడీ సర్కార్ అని దేశమంతా వినిపిస్తోందని, తెలంగాణలో కూడా బీజేపీ వస్తే డబుల్ ఇంజన్ సర్కారు వల్ల తెలంగాణ ప్రగతిలో దూసుకుపోతుందన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన అభివృద్ధి తప్ప, ప్రస్తుత ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేసిందేమీ లేదన్నారు. ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధికి ఇప్పుడు కొబ్బరి కాయలు కొట్టుకుంటూ ఎమ్మెల్యే టైంపాస్ చేస్తున్నాడని విమర్శించారు. గతంలో ప్రభాకర్ ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్,చర్లపల్లి రైల్వే అభివృద్ధి వంటివి చేపట్టి, నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి వేశారని అన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే ఒక్క పని చేసింది లేదన్నారు. ఏది ఏమైనా ఎలాంటి అవినీతి తావు లేని పరిపాలన అందించే ఏకైక పార్టీ బీజేపీ యే అని నరసింహారెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ఈసారి బీజేపీని బలపర్చి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, రామంతపూర్ డివిజన్ యువ మోర్చా అధ్యక్షులు పి.వెంకన్న. బీజేపీ సీనియర్ నాయకులు,అడ్వకేట్ కృష్ణయ్య , శ్రీనివాస్, తాళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మధిర యూనిట్ టీఎన్జీవో ఆధ్వర్యంలో నూతన ఎమ్మార్వో జి.కృష్ణకి అభినందనలు



మధిర జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి:మధిర టీఎన్జీవోస్ యూనిట్ అధ్యక్షులు ఆధ్వర్యంలో ఇటీవల నూతన పదవి బాధ్యతలు చేపట్టిన మదిర మండల రెవెన్యూ ఆఫీసర్ జి కృష్ణ ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రాజేష్ , అధ్యక్షులు సుదర్శన్, కోశాధికారి రజినీకాంత్, అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మణరావు, కే పద్మ ఎస్ టి ఓ ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్ ఆర్ ఐ రమాదేవి, జ్యోతి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



శంకరపట్నం జూన్ 15 ప్రజాపాలన రిపోర్టర్:శంకరపట్నం మండలం అంబాల్పూర్ గ్రామానికి చెందిన బీ.ఆర్.ఎస్.పార్టీ నాయకుడు ఎండి రహీం కొడుకు ఆదిల్ అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి ఓదార్చారు. అనంతరం తాడికల్ గ్రామానికి చెందిన క్రాంతి విద్యుత్ షాక్ తో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను కలసి ప్రమాదానికి గల కారణాలను ఎమ్మెల్యే తెలుసుకొని వారిని ఓదార్చారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, కొత్తగట్టు ఆలయ కమిటీ చైర్మన్ సాగి మలహల్ రావు, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మైపాల్, వివిధ బిఆర్ఎస్ నాయకులు మొకిరాల కిషన్ రావు, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి: ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



మంచిర్యాల టౌన్, జూన్ 15, ప్రజాపాలన : విద్యను వ్యాపారంగా మారుస్తున్న ప్రైవేట్ పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని చెన్నూర్ మండల విద్యాశాఖధికారి కి గురువారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలలు గుర్తింపు లేకుండా నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్ ను అంధకారంలోకి మారుస్తున్నారని విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మర్చి పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ దుస్తులు ఇతరత్రా స్టేషన్ సామాగ్రిని అధిక ధరలకి విక్రయిస్తూ ప్రభుత్వానికి జి ఎస్ టి టాక్స్ రూపంలో రావాల్సిన ఆదాయాన్ని చెల్లించడం లేదని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు పై చర్యలు తీసుకోవాలని గుర్తింపు లేని పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనలిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పురేళ్ళ నితీష్ బచ్చలి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్ లో పాల్గొన్న డైరెక్టర్ వై రాధాకృష్ణ..



తల్లాడ(ఖమ్మం), జూన్ 15 (ప్రజాపాలన న్యూస్): జీ.-20 జన భాగీదారి ప్రజల భాగస్వామ్యం ఒకటే భూమి, ఒకటే కుటుంబం, ఒకటే భవిష్యత్ అనే కార్యక్రమం లో గురువారం ముస్తఫానగర్ నందు గల జనశిక్షన్ సంస్థాన్ ఆధ్వర్యంలో వర్క్ షాప్ ను లబ్దిదారులకు నిర్వహించడం జరిగింది, స్కిల్ పై పూర్తి అవగాహన కల్పించారు. ఆర్థికంగా నిలబడాలని ప్రజలందరు జీవితంలో నైపుణ్యాలపై శ్రద్ధ వహించి అన్ని రంగాలలో రానించాలని,సమాజ శ్రేయస్సు కొరకై పాటుపడాలి అన్నారు. మరియు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ పొందుతున్న లబ్ధిదారుల సద్వినియోగం చేసుకొని యువతీ, యువకులు,పురుషులు,మహిళలందరు స్వయం శక్తి తో ఎదగాలని తెలియజేశారు. కార్యక్రమంలో షాకిన ,రిసోర్స్ పర్సన్స్ ,శాంతి,రజియా జాస్మిన్,పర్వీన్,అనిత, రత్నకుమారి, సౌందర్య,కవిత నాగేశ్వరావు ,మరియు జె యస్ యస్ స్టాఫ్,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తండా గాడి వంపు వాగు నిర్మాణం చేపట్టాలి రైతులను ఆదుకోవాలి: ఎం ధర్మానాయక్ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు



ఇబ్రహింపట్నం జూన్ తేది 15 ప్రజాపాలన ప్రతినిధి: రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఎల్లమ్మ తండా గ్రామంలో ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. ధర్మానాయక్ మాట్లాడుతూ. 2003 సంవత్సరంలో అప్పటి హెూం శాఖ మంత్రి దేవేందర్ గౌడ్ శంకు స్థాపన చేయడం జరిగింది. మొత్తం 143 ఎకరాలలో గాడి వంపు వాగు నిర్మాణం చేయడం వల్ల గిరిజనులు భూములు కోల్పోయారు. 10 గ్రామాలలో సాగునీరు. త్రాగునీరు పశువు గుడ్డు బోధకు నీరు అందుతుందని భావించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మా నీళ్లు మాకు మా నిధులు మాకు ఉంటాయని అనేక దఫాలుగా ప్రచారం చేశారు నేటి ప్రభుత్వాలు గొప్పగా రైతుల కోసం గొప్పగా చేస్తున్నాం అని మాటలు తప్ప చేతులు కావడం లేదని అన్నారు. అప్పట్లో శంకు స్థాపన చేసిన వాగు ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎల్లమ్మ తండా గిరిజన ప్రజలు కూడా ఎన్నో సంవత్సరాల నుండి ఎదురు చూస్తూ ఉన్నారు ప్రభుత్వాలు మారిన ప్రజల కోరిక నెరవేరడం లేదు అన్నారు తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఈ వాగులు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సీపీఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కన్వీనర్ పగడాల యాదయ్య మంచాల మండల సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు సిలివేరు రాజు, ఎల్లమ్మ తండా గిరిజన సంఘం నాయకులు. మాజీ సర్పంచ్ చందు నాయక్, శ్రీనివాస్, రఘువీరు, సీతారాం, లచ్చు, తదితరులు పాల్గొన్నారు.

## భట్టి విక్రమార్క కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మండల కాంగ్రెస్ కమిటీ



ఎర్రుపాలెం జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి:హాథ్ సే హాథ్ జోడోలి యాత్ర లో భాగంగా నల్గొండ జిల్లా చెన్నూరులి గ్రామంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర చేస్తున్న తెలంగాణ ముద్దుబిడ్డ సీఎల్పీ నాయకులు లిభట్టి విక్రమార్క 63వ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ కమిటీ జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేశారు. ముందుగా శాలువా కప్పి బొకే అందించి కేక్ తినిపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి పిసిసి సభ్యులు శీలం ప్రతాపరెడ్డి ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు శీలం శ్రీనివాస్ రెడ్డి అనుమోలు వెంకట కృష్ణారావు దేవరకొండ రాజీవ్ గాంధీ ఉన్నారు.

## ఆత్కూరు గ్రామం లో ఘనంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు



మధిర రూరల్ జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి మండలం పరిధిలో పల్లె ప్రగతి కార్యక్రమంలో జాతీయ జెండా ఎగురవేసిన గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యా రామకృష్ణఈ రోజు ఆత్కూర్ గ్రామంలో సర్పంచ్ అబ్బూరి సంధ్యా రామకృష్ణ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలో భాగంగా పల్లె ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా పంచాయతీ కార్యాలయం నందు గ్రామ సర్పంచ్ అబ్బూరి సంధ్యా రామకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామస్థులతో కలిసి భారీ ర్యాలీతో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ అబ్బూరి సంధ్యా రామకృష్ణ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారుఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కంభంపాటి చిట్టి బాబు గారు వార్డు మెంబర్లు మరియు పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## అమీర్ పేట్ లో ఏసియన్ అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ ను ప్రారంభించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్



వేడిపల్లి, జూన్15 (ప్రజాపాలన ప్రతినిధి) :అమీర్ పేట్ లో అధునాతనంగా నిర్మించిన ఏసియన్ అల్లు అర్జున్ మల్టీప్లెక్స్ ను గురువారం ఐకాన్ సార్ అల్లు అర్జున్ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో అల్లు అరవింద్, డాక్టర్ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, ఐకాన్ స్టార్ అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం రవికుమార్ తో పాటు వందలాది మంది అల్లు అర్జున్ అభిమానులు పాల్గొన్నారు.

## నర్మెట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారికి సన్మానం



హైదరాబాద్ 14 జూన్ ప్రజాపాలన: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2 వ తేదీ నుండి 22 లో తేదీ వరకు రోజు వారి కార్యక్రమాలతో ప్రణాళిక తయారు చేసి అదే వరుస క్రమంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా రోజు వారీగా కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు ఆయా జిల్లా పరిపాలనా అధికారుల సారధ్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. జూన్ 14 తేదీ న వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో మంత్రులు స్థానిక శాసనసభ్యులు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ లు ప్రజా ప్రతినిధులు నాయకులు వైద్య అధికారులను సిబ్బంది పాల్గొన్నారు. ఉత్తమ సేవలు అందించిన వైద్య అధికారులను సిబ్బందిని రాష్ట్ర వ్యాప్తంగా సత్కరించారు. జనగాం జిల్లా కేంద్రంలో స్థానిక శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్య అధికారులను సిబ్బందిని స్థానిక శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. ఇందులో భాగంగా నర్మెట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.కిశోర్ తాల్క ను మెమొంటో తో సత్కరించారు. పలువురు వైద్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు నాయకులు మిత్రులు డాక్టర్.కిశోర్ కు అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా బట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలు



మధిర, జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి:మధిర కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు ఆధ్వర్యంలో రైల్వే గేటు దగ్గర ఘనంగా బట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగా హనుమంతరావు మాట్లాడుతూ మండుటెండల్లో కూడా బట్టి మార్క పాదయాత్రకి అపూర్వ స్పందన వస్తుందనన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది భట్టి విక్రమార్క నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నే అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మదిర లో భట్టి విక్రమార్క దే విజయం అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిర్యాల వెంకటరమణ గుప్తా, దారా బాలరాజు, తూమాటి నవీన్ రెడ్డి , తలపుల వెంకటేశ్వర్లు, షేక్ జహంగీర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శం: ఎమ్మెల్యే కిషన్ రెడ్డి



ఇబ్రహింపట్నం జూన్ తేది 15 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ రోజు పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా మంచాల మండలంలోని కొర్రవానితాండ లోయపల్లి గ్రామాల్లో పల్లె ప్రగతి వేడుకల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామపంచాయతీల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించి, లోయపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ. పల్లెల సమగ్ర అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టారని. పల్లె ప్రగతితో పల్లెల రూపురేఖలు మారాయని, తెలంగాణ పల్లెలు దేశానికే ఆదర్శమని. దేశంలో ఏ రాష్టాలలో లేని విధంగా ప్రతీ పల్లెల్లో స్మశానవాటిక, ప్రకృతి వనాలు నిర్మించుకున్నామని అన్నారు. నేడు తెలంగాణ పల్లెలు మౌలిక వసతులతో, పరిశుభ్రతతో, పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణాలతో దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులకు ఉత్తమ సేవా పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామ శాఖ అధ్యక్షుడు జానయ్య తల్లి ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటా చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్పుల చెంద్రయ్య, ఎంపిపి నర్మదా , సర్పంచ్లు, ఎంపీటీసీలు మండల అధ్యక్షుడు చీరాల రమేష్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎల్పీ నేత భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



బోనకల్, జూన్ 15 ప్రజా పాలన ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర సిఎల్పి నేత,మధిర శాసన సభ్యులు ''మల్లు భట్టి విక్రమార్క''జన్మదిన సంధర్భంగా గురువారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావులు కేక్ కట్ చేసి ఘనంగా విక్రమార్క జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ జన్మదిన వేడుక కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులూ పీసీసీ సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావులు మాట్లాడుతూ సీఎల్పీ నేతగా వ్యవహరిస్తూ అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను అసెంబ్లీలోనూ,పాదయాత్రల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తూ ఎండగడుతూ కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకి జన్మదినం సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబు,కలకోట సొసైటీ ఛైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరరావ,మండల ఎస్సి సెల్,బీసీ సెల్ అధ్యక్షులు మారుపల్లి ప్రేమ్ కుమార్, కందుల పాపారావు,సీనియర్ నాయకులు తిరపతిరావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూక్యా భద్రు నాయక్,జెట్టం పుల్లయ్య పలు గ్రామాల నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేహాను ఆశీర్వదించిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు..



తల్లాడ(ఖమ్మం), జూన్ 15 (ప్రజాపాలన న్యూస్):జనశిక్షణ సంస్థాన్ ఖమ్మంజిల్లా డైరెక్టర్ యల్లాబత్తిన రాధాకృష్ణ, రాణి దంపతుల కుమార్తె నేహ ఓణీల అలంకరణ వేడుక గురువారం ఖమ్మంలోని శబరి గార్డెన్ లో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేహాకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా డైరెక్టర్ రాధాకృష్ణ దంపతులకు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పట్టణానికి చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, జర్నలిస్టు సోదరులు, జనశిక్షణ సంస్థన్ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్స్ ను ఘనంగా సన్మాంచిన కలకోట సర్పంచ్



బోనకల్, జూన్ 15 ప్రజాపాలన ప్రతినిధి: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పల్లె ప్రగతి దినోత్సవం ను మండలంలోని కలకోట గ్రామపంచాయతీలో సర్పంచ్ యంగల దయామణి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు, అనంతరం గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామ సభలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచటంలో మల్టీపర్పస్ వర్కర్స్ చేస్తున్న సేవలు అమోఘమైనవని అన్నారు. కరోనా మహమ్మరికి కూడా భయపడకుండా ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గ్రామ దీపికలు, గ్రామములో ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలకు ఎనలేని సేవలు చేసారన్నారు వారి సేవలను అభినందిస్తూ సెక్రెటరీ లక్ష్మి తో కలిసి శాలువాలతో అందరిని ఘనంగా సత్కరించారు. మల్టిపర్పస్ వర్కర్స్ కు నూతన వస్త్రములు బహుకరించారు,ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పారిశుద్ధ కార్మికులకు శాలువా కప్పి సన్మానించిన సర్పంచ్ బూడిద రామిరెడ్డి



ఇబ్రహీంపట్నం జూన్ తేది 15 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఈవో రంగారావు డి ఎల్ పి ఓ సంధ్యారాణి ఎంపీపీ కృపేష్ ఎంపీడీవో క్రాంతి కిరణ్ ఎంపీ ఓ లక్పతి నాయక్ ప్రత్యేక అధికారి డాక్టర్ సురేందర్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు కోఆప్షన్ సభ్యులు కమ్యూనిటీ కోఆర్డినేటర్ జంగమ్మ కార్యదర్శి రిషిక నేత గ్రామ ప్రజల అందరితో కలిసి పల్లె ప్రగతి కార్యక్రమంలో జాతీయ జెండా ఎగురవేసి ఉప్పరిగూడ ప్రగతి గురించి సర్పంచ్ రామ్ రెడ్డి వివరించారు పారిశుధ్య కార్మికులకు అధికారులను సన్మానించడం జరిగింది తెలంగాణ పటం ముగ్గు వేసి మానవహారం నిర్వహించడం జరిగింది. ర్యాలీగా బయలుదేరి ఊరంతా నినాదాలతో తిరగడం జరిగింది తర్వాత రైతు వేదిక దగ్గర సహపంక్తి భోజనం కార్యక్రమం పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పల్లె ప్రగతి.. తెలంగాణ ఖ్యాతి



ఎర్రుపాలెం జూన్ 15 ( ప్రజాపాలన ప్రతినిధి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నందు స్థానిక సర్పంచి మొగిలి అప్పారావు జాతీయ జెండా ఆవిష్కరణ గావించి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల భాగంగా గురువారం పంచాయతీ ఆఫీసు నందు సఫాయి కార్మికులకు ఘన సత్కారం చేశారు . ప్రధమంగా రింగ్ సెంటర్ నుంచి గాంధీ సెంటర్ మీదుగా పంచాయతీ కార్యాలయం వరకు డీజేల తో,భారీ పల్లె ప్రగతి ర్యాలీ నిర్వహించారు. దేశానికి రక్ష సిఫాయిలైతే, పారిశుద్ధ కార్మికులు పల్లె ప్రగతికి సోపానాలు వారిని సన్మానించుకోవటం మనకెంతో సౌభాగ్యమని కొనియడారు. సఫాయిలైన హరి, శ్రీను, వేల్పుల పోతయ్య, చిన్న మ్మాయి, పాముల.మల్లేశ్వరి,అద్దంకి లక్ష్మి, పల్లె ప్రగతిలో పాల్గొన్న అధికారులు ప్రజా ప్రతినిధులు ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష, ఎం పి ఓ గంధం శ్రీలక్ష్మి,సర్పంచి మొగిలి అప్పారావు, ఉప సర్పంచ్ దేవరకొండ అనిల్ కుమార్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పంబి. సాంబశివరావు, ఎంపీటీసీ షేక్ మస్తాన్ వలి, కార్యదర్శి నాగేశ్వరరావు, గుర్రాల పుల్లారెడ్డి దేవరకొండ రవి ,ఆశా కార్యకర్తలు విజయ ,హేమలత,మరియు అంగన్వాడీ టీచర్లు దేవరకొండ వీర కుమారి, ఆశమ్మ , వేల్పుల వసంత రేఖ, ప్రమీల ,వెలుగు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బేగరి అరుణ్ కుమార్**



చేవెళ్ల జూన్ 15, (ప్రజాపాలన): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు బేగరి అరుణ్ కుమార్ అన్నారు. గురువారం రోజున చేవెళ్ల మండలం కేంద్రంలో పత్రిక విలేఖరి సమావేశంలో మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్నటువంటి ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో పకడ్బందీగా ఫీజుల నియంత్ర చట్టాన్ని అమలు చేయాలని అన్నారు. ప్రైవేట్ యజమానులు విద్య పేరుతో వ్యాపారం చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ప్రవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నారని అన్నారు. దీన్ని వెంటనే గమనించి ప్రవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. ఫీజులతో తల్లిదండ్రులను పీడిస్తూ అధిక ఫీజులు వసూలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొచ్చి, కామన్ ఫీజు విధానాన్ని అన్ని పాఠశాలలో అమలు చేయాలని కోరారు లేని పక్షాన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకాలు, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



# ఓటిటిలో పాన్ ఇండియా భాషల్లో "అన్నీ మంచి శకునములే".!




లేటెస్ట్ గా మన టాలీవుడ్ సినిమా దగ్గర వచ్చిన డీసెంట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చిత్రం "అన్నీ మంచి శకునములే". యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో సంతోష్ శోభన్ అలాగే మాళవిక నైర్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రంని లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి అయితే దర్శకత్వం వహించారు. ఇక ఈ చిత్రం అయితే థియేట్రికల్ రన్ తర్వాత ఇప్పుడు ఓటిటి లో స్ట్రీమింగ్ కి వచ్చేందుకు సిద్ధం అయ్యింది. మరి ఈ సినిమా తాలూకా ఓటిటి హక్కులు అయితే ప్రముఖ స్ట్రీమింగ్ సంస్థ అమేజాన్ ప్రైమ్ వీడియో వారు సొంతం చేసుకోగా ఇక ఇందులో ఈ చిత్రం ఈ జూన్ 17 నుంచి అయితే స్ట్రీమింగ్ కి సిద్ధం అయ్యింది. పైగా పాన్ ఇండియా భాషల్లో అయితే ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ స్ట్రీమ్ కానుండడం విశేషం. మరి ఈ డేట్ న అయితే ఈ చిత్రం ఒరిజినల్ తెలుగు సహా హిందీ కన్నడ, మలయాళ మరియు తమిళ్ భాషల్లో అయితే స్ట్రీమింగ్ అందుబాటులోకి రానున్నట్టుగా ప్రైమ్ వీడియో వారు కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా ప్రియాంక దత్ నిర్మాణం వహించారు.

# మన హీరోల సిక్స్ ప్యాక్ అట్టర్ ఫ్లాప్

బాలీవుడ్ హీరోలు సిక్స్ ప్యాక్ లో కనిపించడం అనేది చాలా కామన్ విషయం. ఆరు పదుల వయసు కు చేరువ అయిన బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ కూడా ఎయిట్ ప్యాక్ బ్యాడీ తో పఠాన్ సినిమా లో సర్ ప్రైజ్ చేసిన విషయం తెల్సిందే. ఇంకా పలువురు బాలీవుడ్ హీరోలు కూడా సిక్స్ ప్యాక్ మరియు ఎయిట్ ప్యాక్ బాడీస్ తో కన్నుల విందు చేయడం జరిగింది. ఇక తెలుగు హీరోల్లో కూడా చాలా మంది సిక్స్ ప్యాక్ బాడీ ని ట్రై చేశారు. అయితే సిక్స్ ప్యాక్ బాడీ తో కనిపించిన హీరోల్లో అతి తక్కువ మంది తెలుగు హీరోలు మాత్రమే ఆకట్టుకున్నారు. ఎక్కువ శాతం మంది తెలుగు హీరోలు ప్యాక్ బాడీ తో కనిపించి విమర్శలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ఫేస్ లో గ్లో పోయిందని... ఫిజిక్ సరిగా



లేదంటూ పలువురు పలు రకాలుగా మాట్లాడుకున్నారు. ఇప్పుడు విజయ్ దేవరకొండ కూడా సిక్స్ ప్యాక్ బాడీ తో పరశురామ్ దర్శకత్వంలో కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇటీవల ఆ సినిమా లాంఛనంగా ప్రారంభం అయ్యింది. ఆ సందర్భంగా విజయ్ దేవరకొండ ను చూస్తే గతంలో అర్జున్ రెడ్డి.. గీత గోవిందం సినిమాల్లో కనిపించినంత ఆకర్షణీయంగా కనిపించడం లేదు. తాజా సినిమా ఓపెనింగ్ స్టిల్స్ లో విజయ్ దేవరకొండ ఫేస్ లో కల లేకపోవడంతో పాటు నీరసం కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని... ఇదంతా కూడా సిక్స్ ప్యాక్ బాడీ అవ్వడం వల్లే అనే అభిప్రాయం ను కొందరు నెటిజన్స్ మరియు రౌడీ స్టార్ ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. హిందీ హీరోలు సిక్స్ ప్యాక్.. ఎయిట్ ప్యాక్ బాడీ తో కనిపిస్తే సెక్సీ గా వావ్ అనిపించేంత అందంగా కనిపిస్తారు.

కానీ తెలుగు హీరోల సిక్స్ బాడీస్ మాత్రం అలా ఉండటం లేదని.. వారు సిక్స్ ప్యాక్ బాడీ ని ట్రై చేసిన సమయంలో వారి ఫేస్ లో గ్లో అనేది కనిపించకుండా పోతుంది.. ఆర్టిఫిషియల్ గా అందంను తెచ్చుకున్నట్లుగా ఉంటుందని కొందరు అభిమానులు నెట్టింట చర్చించుకుంటున్నారు. విజయ్ దేవరకొండ మాత్రమే కాకుండా అప్పట్లో ఎన్టీఆర్.. మహేష్ బాబు ఇంకా పలువురు తెలుగు హీరోలు కూడా సిక్స్ ప్యాక్ ట్రై చేశారు. వారు కూడా గ్లో కోల్పోయారు అంటూ అప్పట్లో చర్చ జరిగింది. మొత్తానికి మన హీరోల్లో ఎక్కువ శాతం మంది సిక్స్ ప్యాక్ ప్రయత్నాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. ముందు ముందు అయినా మన హీరోలు ఫేస్ గ్లో మిస్ అవ్వకుండా సిక్స్ ప్యాక్ ను చూపిస్తారేమో చూడాలి.

# ఆ తమిళ్ స్టార్ హీరో తో ఏషియన్ కొత్త మల్టీప్లెక్స్

ఏషియన్ సినిమాస్ వాళ్లు కొంత కాలంగా తమ కార్యకలాపాల ను విస్తృతం చేస్తున్నారు. ఇందులో భాగంగానే డిస్ట్రిబ్యూషన్ నుంచి సినిమాల నిర్మాణం వంటివి చేపడుతున్నారు. అలాగే స్టార్ హీరో లతో కలిసి కొత్త మల్టీప్లెక్స్ ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగానే కొన్నేళ్ల క్రితమే సూపర్ స్టార్ మహేశ్ బాబు తో కలిసి AMB సినిమాస్ అనే మల్టీప్లెక్స్ను నిర్మించారు. సూపర్ స్టార్ మహేశ్ బాబు AMB సినిమాస్ బాగా క్లిక్ అవడంతో ఏషియన్ సినిమాస్ సంస్థ పలువురు స్టార్ హీరో లతో కలిసి మరిన్ని థియేటర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ క్రమం లోనే ఇప్పటికే మహబూబ్నగర్ లో విజయ్ దేవరకొండ తో కలిసి AVD మల్టీప్లెక్స్ను ఏర్పాటు చేసింది. అలాగే తాజాగా హైదరాబాద్ లోని అమీర్పేట లో అల్లు అర్జున్ భాగస్వామ్యంతో AAA సినిమాస్ స్టార్ట్ చేసింది. సినిమాస్ మల్టీప్లెక్స్ ఓపెనింగ్ ఈవెంట్ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏషియన్ సునీల్ మీడియా తో మాట్లాడుతూ మరిన్ని అంశాల ను వెల్లడించారు. ఇప్పటికే తమ సంస్థ నుంచి చాలా ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే చెన్నై లోనూ కొన్ని థియేటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన మీడియా కు తెలిపారు. ఇక చెన్నై లో నిర్మిస్తోన్న మల్టీప్లెక్స్కు కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ భాగస్వామిగా ఉన్నారని తాజాగా ఏషియన్ సునీల్ వెల్లడించారు. అంటే.. ఇప్పుడు ఈ లిస్టులో మహేశ్ బాబు విజయ్ దేవరకొండ అల్లు అర్జున్ తర్వాత అతడు కూడా చేరిపోయాడు. ఈ మల్టీప్లెక్స్ కూడా అధునాతన టెక్నాలజీ తో ఏర్పాటు అవుతున్నట్లు చెప్పారు. త్వరలోనే దీన్ని స్టార్ట్ చేస్తామని పేర్కొన్నారు. తాజాగా జరిగిన మీడియా సమావేశం లో సునీల్ను ఓ ప్రతినిధి 'మీరు వరుసగా హీరో లతో కలిసే మల్టీప్లెక్స్ నిర్మాణం ఎందుకు చేస్తున్నారు' అని ప్రశ్నించారు. దీనికాయన 'మేము ఏదీ ప్లాన్ ప్రకారం చేయడం లేదు. అవి అలా జరిగిపోతున్నాయి. మహేశ్ గారి తో



మా నాన్న గారు ఏఎంబీ స్టార్ట్ చేశారు. తర్వాత మేము ఇలా కంటిన్యూ చేస్తున్నాము' అని క్లారిటీ ఇచ్చారు. మొత్తానికి టాలీవుడ్ నుంచి కోలీవుడ్ వరకూ ఏషియన్ విస్తరించిందని చెప్పొచ్చు.

# కొరటాల శివ కి టీమ్ "దేవర" బర్త్ డే విషెస్!

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ కొరటాల శివ ప్రస్తుతం యన్ టైగర్ ఎన్టీఆర్ తో దేవర అనే పాన్ ఇండియా మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం నుండి విడుదల అయిన ఫస్ట్ లుక్ కి ప్రేక్షకుల నుండి, అభిమానుల నుండి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. నేడు కొరటాల శివ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ సరికొత్త పోస్టర్ తో బర్త్ డే విషెస్ తెలిపారు. దేవర చిత్రం అనౌన్స్ మెంట్ తోనే ఎంతో క్రేజ్ ను సొంతం చేసుకుంది. ఈ చిత్రం ను మేకర్స్ ఏప్రిల్ 5, 2024 న వరల్డ్ వైడ్ గా థియేటర్ల లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రం లో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. సెన్సేషన్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ రవి చందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం పై భారీ అంచనాలు నెలకొన్నాయి.





# గుంటూరు కారం.. ఎంత బ్యాలెన్స్ ఉందంటే?



టాలీవుడ్ లో పక్కా కమర్షియల్ చిత్రాల కు కేరాఫ్ అడ్రెస్ గా నిలుస్తూ.. ఎన్నో హిట్లను ఖాతా లో వేసుకుంటూ దూసుకుపోతోన్నాడు సూపర్ స్టార్ మహేశ్ బాబు. ఇలానే ఆ మధ్య వరుస గా హ్యాట్రిక్ విజయాల ను సొంతం చేసుకున్న అతడు.. గత ఏడాది వచ్చిన 'సర్కారు వారి పాట'తో ఆశించిన సక్సెస్ ను సొంతం చేసుకోలేదు. దీంతో ఈ సారి ఎలాగైనా గట్టిగా కొట్టాలని ఫిక్స్ అయ్యాడు. భారీ హిట్ కొట్టాలన్న కసి తో ఉన్న సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తో కలిసి 'గుంటూరు కారం' అనే సినిమా ను చేస్తున్నాడు. ఫుల్ లెంగ్త్ మాస్ ఎంటర్టైనర్ గా రూపొందుతోన్న ఈ చిత్రం పై అంచనాలు భారీ గా ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే దీన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. దీంతో దీని పై హైప్ బాగా పెరిగిపోతోంది. సక్సెస్ ఫుల్ కాంబో లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోన్న 'గుంటూరు కారం' సినిమా కు సంబంధించిన రెగ్యూలర్ షూటింగ్ చాలా రోజుల క్రితమే ప్రారంభం అయింది. కానీ మధ్యలో కొన్ని ఆటంకాలు ఎదురు కావడంతో చిత్రీకరణ సజావుగా సాగడం లేదు. దీంతో ఈ ఏడాది రిలీజ్ చేస్తారనుకున్న ఈ చిత్రం వచ్చే సంవత్సరం సంక్రాంతికి వాయిదా పడిపోయిన విషయం తెలిసిందే. వాస్తవానికి 'గుంటూరు కారం' మూవీ కి సంబంధించి కొత్త షెడ్యూల్ ను ఈ వారం లో జరపాల ని అనుకున్నారు. కానీ ఆర్టిస్టుల డేట్స్ వర్కౌట్ కాకపోవడంతో దీన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఇక తాజా సమాచారం ప్రకారం.. ఈ మూవీ కి ఇప్పటి వరకూ జరిగింది కాకుండా.. ఇంకా 78 రోజుల షూటింగ్ బ్యాలెన్స్ ఉందట. ఇదంతా ఏకధాటి గా జరిపేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్లు తాజాగా తెలిసింది. బ్యాలెన్స్ ఉన్న 'గుంటూరు కారం' మొత్తం టాకీ పార్టు ను భారీ షెడ్యూల్ లోనే ఫినీష్ చేయాలని భావిస్తున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లుగానే మహేశ్ కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నాడని టాక్. ఇక ఈ చిత్రాన్ని రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఇందులో పూజా హెగ్దే శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. దీనికి థమన్ సంగీతం ఇస్తున్నాడు. ఇటీవలే దీని నుంచి వచ్చిన గ్లింప్స్ వీడియో కు రికార్డు స్థాయి లో వ్యూస్ వచ్చాయి.

# ధనుష్ "కెప్టెన్ మిల్లర్" పై ఇంట్రెస్టింగ్ బజ్.!




కోలీవుడ్ గ్లోబల్ హీరో ధనుష్ హీరోగా ఇపుడు పలు చిత్రాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి రీసెంట్ గానే మన టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి తో చేసిన భారీ హిట్ చిత్రం "సార్" తర్వాత ధనుష్ సినిమాలపై మరిన్ని అంచనాలు అయితే నెలకొన్నాయి. ఇక ఈ లైనప్ లో ఉన్న ఓ భారీ చిత్రం "కెప్టెన్ మిల్లర్". దర్శకుడు అరుణ్ మాతేశ్వర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై మంచి హైప్ ఉండగా ఇప్పుడు ఓ క్రేజీ బజ్ దీనిపై తెలుస్తుంది. ఈ చిత్రాన్ని మేకర్స్ మొత్తం మూడు భాగాలుగా అయితే తెరకెక్కిస్తున్నారట. అలాగే ఒకో పార్ట్ కూడా ఒకో కాలంలో ఉంటుంది అని తెలుస్తుంది. మరి ఫస్ట్ పార్ట్ 1940టైం లో ఉంటే రెండో పార్ట్ 1990 లలో ఉంటుందట అలాగే ఫైనల్ పార్ట్ ప్రస్తుత కాలంలో ఉంటుంది అని తెలుస్తుంది. మరి ఇది వినడానికి ఇంట్రెస్టింగ్ గానే ఉంది. మరి నిజంగా మూడు భాగాలుగా ఈ సినిమా ఉంటుందో లేదో చూడాలి.


జై భీమ్

బహుజనులు అంటే ఎవరు?
ఈ దేశం బాగుండాలని కోరుకునే ప్రతి ఒక్క మైనారిటీ SC,ST,BC,OC కులాల్లో ఉన్న ప్రజలందరు బహుజనులే

ఏకైక లక్ష్యం బహుజన రాజ్యాధికారం సాధించడమే

ఆలోచించండి!
➤2016 లెక్కల ప్రకారం నేషనల్ శాంపిల్ సర్వే (NSSO ) వారు కులాల జనాభా నిష్పతి
➤BC 41%, SC 20%, ST 9%, OC 30%
➤ప్రస్తుతం అనుభవిస్తున్న రిజర్వేషన్స్ BC 27%, SC15.5%, ST 7.5%, OC 50%
ఆలోచించండి!
రిజర్వేషన్ కావాలా? రిప్రజెంటేషన్ కావాలా?
జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్ కావాలని ప్రతిపాదిస్తుంది

50% రిప్రజెంటేషన్
మహిళలకు 50% రిప్రజెంటేషన్ (రిజర్వేషన్స్) కల్పించడమే మా ధ్యేయం

బీసీలను సీఎం చెయ్యాలి
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చెప్పిన మాస్టర్ కీ ని సాధించడమే మా నినాదం
అధిక జనాభా ఉన్న BCని CM చేయాలనేది లక్ష్యం

మనం గెలవాలంటే MAM ను ఆచరించాలి
MAM అంటే
M : ఆశయా లకు, నీకు ,మద్దతు ఇచ్చే వాళ్ళని మెంబర్స్ గా చేసుకోవాలి, నిన్ను ఇష్టపడే వాళ్ళని నాయకుడిగా నామినేట్ చేయాలి
A : నిన్ను నీ కమిటీలను కాపాడటానికి అడ్వకేట్స్ కమిటీని పెట్టాలి
M : నిన్ను ప్రపంచానికి పరిచయం చేసి నాయకుడుగా గెలిపించడానికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మీ చేతిలో ఉండాలి

5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి MLA గా MLC గా ఉండాలని సమర్ధిస్తుంది

కుల రహిత సమాజం
డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోరుకున్న కులరహిత సమాజం కోరకు కులాంతర వివాహం చేసుకున్న వారి పిల్లలకు మరియు కులం వద్దు అనేవారికి సమతా కులం అని నమోదు చేయటానికి మద్ధతు.

శివ భాగ్య రావు బహుజన్, IRS-vrs
నేషనల్ కన్వీనర్

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి (PARS)

జై పూలే జై భీమ్ జై బహుజన్ జై భారత్


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part 'A'), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989